thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

ట్రెడ్ మిల్ పై యాష్లే ప్రపంచ రికార్డు




11

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 135| జగిత్యాల | మంగళవారం 18 ఆగస్టు, 2026 ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## 'సర్' ముసాయిదా జాబితా విడుదల




### తెలంగాణలో 'సర్' ఎన్యూమరేషన్ పూర్తి

- 2.65 కోట్ల మంది నుంచి పత్రాల స్వీకరణ
- మొత్తం ఓటర్లలో 78.30 శాతం నమోదు
- ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల
- సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలకు అవకాశం
- అర్హుడైన ఒక్క ఓటరూ జాబితా నుంచి తప్పిపోవద్దన్న సీఈవో సుదర్శన్‌రెడ్డి

వివరాలు 2వ పేజీలో

- 78.30 శాతం ఎన్యూమరేషన్ పత్రాల స్వీకరణ
- 2.73 శాతం మంది మృతులుగా గుర్తింపు
- 60 లక్షల మంది ఓటర్ల వివరాల్లో అసమానతలు
- మ్యాపింగ్ కాని ఓటర్లు మరో 32 లక్షలు
- 92 లక్షల మందికి నోటీసులు జారీ చేసే అవకాశం
- అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా

తెలంగాణలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో కీలక ఘట్టం పూర్తయింది. రాష్ట్రంలో 'సర్' ముసాయిదా ఓటర్ల జాబితాను ఎన్నికల అధికారులు విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఎన్యూమరేషన్ ప్రక్రియలో 78.30 శాతం పత్రాలు అందినట్లు అధికారులు వెల్లడించారు. 2



## పేదలకు కార్పొరేట్ వైద్యం.. అదే మా లక్ష్యం

### విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం

**32 నెలల్లో ఆరోగ్యశ్రీకి రూ.2,600 కోట్ల వ్యయం**

**పేదల ఆరోగ్యం కోసం రూ.5,226 కోట్లు ఖర్చు**

- ఆస్పత్రులు పూర్తయితే కొత్తగా 10 వేల పడకలు అందుబాటులోకి
- 2027 డిసెంబర్ 9 నాటికి ఉస్మానియా సహా ఆస్పత్రులన్నీ పూర్తి
- గత పాలకులు టిమ్స్‌లకు కొబ్బరికాయలు కొట్టి వదిలేశారు
- సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలనలో విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సనత్ నగర్ టిమ్స్ (తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) ఆస్పత్రిని ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్యాన్ని అందించడంతో పాటు, విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం తెలిపారు. గడిచిన 32 నెలల్లో ఆరోగ్యశ్రీ పథకం కోసం రూ.2,600 కోట్లు, సీఎమ్ఆర్ఎఫ్ (జవీ=ఖీ) కింద రూ.2,526 కోట్లు వెచ్చించినట్లు వెల్లడించారు. గడిచిన రెండేళ్ల కాలంలో వైద్య ఆరోగ్య శాఖకు మొత్తం రూ.21,800 కోట్లు కేటాయించి సేవలను విస్తరించామని పేర్కొన్నారు. మన రాష్ట్ర నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ, జపాన్ వంటి అంతర్జాతీయ దేశాల్లోనూ ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని, వారికి తగిన శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తామని చెప్పారు. 2

- హైదరాబాద్, ఆగస్టు 17



### ప్రజల భద్రత, రక్షణ, సంక్షేమానికి ప్రాధాన్యం

- ఆహారం, ఔషధాల నాణ్యతపై కఠిన నిఘా
- ఏకీకృత వ్యవస్థగా 'తెలంగాణ సేఫ్' ఏర్పాటు
- నిబంధనలు ఉల్లంఘిస్తే తక్షణ చర్యలు
- 'ఎక్స్' వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి

2

### ఎన్‌టీఏ తప్పులకు విద్యార్థుల మూల్యం

- మండిపడ్డ రాహుల్ గాంధీ
- యూజీసీ-నెట్ రద్దుపై ఆగ్రహం
- సుప్రీంకోర్టులో రాహుల్‌కు ఊరట
- జార్ఖండ్ విద్యార్థులను కలవాలని సీఎం సోరెన్‌కు లేఖ



.. వివరాలు 4లో

## అశోక్‌ధామ్‌లో తొక్కిసలాట

- ఏడుగురు భక్తుల దుర్మరణం
- విద్యుత్ తీగ పడిందన్న భయంతో పరుగులు
- ఒకరిపై మరొకరు పడిన భక్తులు
- పలువురికి గాయాలు.. ఆసుపత్రికి తరలింపు
- మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున పరిహారం
- ఘటనపై మోదీ దిగ్భ్రాంతి

4





### ఎంపీ, ఎమ్మెల్యేలపై 4,192 క్రిమినల్ కేసులు

- పదేళ్లు దాటినా తేలని 519 కేసులు
- పదేళ్లుగా పెండింగ్‌లో మరో 754
- సిట్టింగ్ ఎంపీలపై 335.. ఎమ్మెల్యేలపై 1,222 కేసులు
- 700 కేసుల్లో పూర్తికాని దర్యాప్తు
- సుప్రీంకోర్టుకు అమికస్ క్యూరీ 22వ నివేదిక



.. వివరాలు 4లో

## 22ఏ భూములపై ఆందోళన వద్దు

- అధికారుల తప్పిదం వల్లనే ఇలా జరిగింది
- అందుకు ప్రజలను క్షమాపణలు కోరుతున్నాం
- నిషేధిత జాబితా నుంచి భూములను తొలగిస్తాం
- టోల్‌ఫ్రీ నంబర్ 18005994788కు సంప్రదించాలి
- ప్రజలను ఆఫీసులకు తిప్పే అధికారులపై చర్యలు తీసుకుంటాం
- మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి వివరణ



ప్రైవేటు వ్యక్తుల ఆస్తికి ఆటంకం కలిగించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రైవేటు భూమిని 22ఏలో పెట్టారంటూ మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల నుంచి 750 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. 2

## 22ఏతో దోపిడీ.. తప్పు బయటపడితే 'సారీ'!

### సర్కార్ నడుపుతున్నారా.. సర్కస్ నడుపుతున్నారా?

- ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టి గందరగోళం సృష్టించారు
- సీఎం ఇంటికే సెగ తగిలాక ప్రభుత్వంలో చురుకు
- తప్పులు సర్కార్‌వి.. అధికారులను బలి చేయడం ఎందుకు?
- కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పైనా పేదల్లో ఆందోళన
- 22ఏ వ్యవహారంపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్
- కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు, బీఆర్ఎస్ తీవ్రస్థాయిలో ధ్వజం



3

"సర్కార్ నడుపుతున్నారా.. సర్కస్ నడుపుతున్నారా? తప్పులు ప్రభుత్వం చేస్తే అధికారులు బలి కావాలా? ప్రజల జీవితాలు, ఆస్తులతో ముడిపడిన అంశాల్లో ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకుని.. వ్యవహారం బయటపడగానే 'సారీ' చెప్పి చేతులు దులుపుకుంటారా?" అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది.

## షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి ఆగవు 3

పథకాల కొనసాగింపునకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి



## సొంత పార్టీపై కాంగ్రెస్ సీనియర్ నేత ఆరోపణలు

- గత ఎన్నికల్లో డబ్బుల ఆశతోనే తనకు టికెట్ నిరాకరించారని విమర్శ
- కాంగ్రెస్ జెండా మోయని వారికి ప్రాధాన్యం ఇవ్వడంపై అసంతృప్తి
- వనపర్తి అభివృద్ధికి విఘాతం కలిగిస్తున్నారని చిన్నారెడ్డి ఆవేదన

2



చురకలు





# 22ఏ భూములపై ఆందోళన వద్దు

**అధికారుల తప్పిదం వల్లనే ఇలా జరిగింది**
**అందుకు ప్రజలను క్షమాపణలు కోరుతున్నాం**
**నిషేధిత జాబితా నుంచి భూములను తొలగిస్తాం**
**టోల్‌ఫ్రీ నంబర్ 18005994788కు సంప్రదించాలి**
**ప్రజలను ఆఫీసులకు తిప్పే అధికారులపై చర్యలు తీసుకుంటాం**
**మీడియా సమావేశంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి వివరణ**

**హైదరాబాద్, ఆగస్ట్ 17:** ప్రైవేటు వ్యక్తుల ఆస్తికి ఆటంకం కలిగించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రైవేటు భూమిని 22ఏలో పెట్టారంటూ మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల నుంచి 750 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో పొంగులేటి మాట్లాడుతూ..అధికారుల పొరపాటు వల్ల ఇలా జరిగిందన్నారు. 22ఏ భూములపై నాలుగు జిల్లాల్లోని అధికారులతో కలిసి చర్చించాం. గతంలో ఆ భూములు యూఎల్‌సీ జాబితాలో ఉన్నాయి. నిషేధిత జాబితాను అప్‌డేట్ చేయడంలో పొరపాటు జరిగిందన్నారు. అధికారుల తరఫున క్షమాపణలు కోరుతున్నానని మంత్రి అన్నారు. ప్రైవేట్ ఆస్తుల్ని 22ఏ జాబితా నుంచి త్వరలోనే తొలగిస్తాం. దీనికి సంబంధించి ఫిర్యాదులు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 18005994788కు సంప్రదించాలన్నారు. భూములకు సంబంధించి అన్నీ సక్రమంగా ఉన్నవారు ఆందోళన చెందవద్దని పొంగులేటి అన్నారు. 22ఎ వల్ల ఇబ్బంది పడుతున్న ప్రజలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణలు చెప్పారు. దీన్ని బూచిగా చూపి ప్రజలను ఆఫీస్‌ల చుట్టూ తిప్పితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ వ్యవహారంలో సత్వర కేసుల పరిష్కారం కోసం ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. జెన్యూన్ కేసుల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 18005- 994788కి ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. మేడ్చల్ జిల్లాలో అత్యధికంగా 511 అప్లికేషన్లు, రంగారెడ్డి జిల్లాలో 146 అప్లికేషన్లు వచ్చాయి. హైదరాబాద్‌లో 49, సంగారెడ్డిలో 38 అప్లికేషన్లు వచ్చాయి. ప్రైవేటు భూమిని 22-ఎ కింద పెట్టారని 757 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇవన్నీ 22-ఎ జాబితాలోకి ఎందుకు వచ్చాయనే అంశంపై చర్చించాం. ప్రైవేటు ఆస్తుల యజమానులను ఇబ్బందిపెట్టాలనే ఉద్దేశం మాకు లేదు. గ్రౌండ్ రియాలిటీ ఎలా ఉందనే అంశంపై సమీక్షించాం. న్యాయంగా ఉన్నవాటిని త్వరలోనే నిషేధిత జాబితా నుంచి తొలగిస్తాం'.. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. కోర్టులకు వెళ్లాల్సిన పనిలేదు. అధికారులకు అప్లికేషన్స్ ఇస్తే చాలని మంత్రి వివరించారు. న్యాయబద్ధమైన మీ ఆస్తులకు తొందరగా క్లియరెన్స్ లభిస్తుంది. ప్రజలు ఆందోళన చెందవద్దు. కొన్ని ప్రాంతాల్లో అధికారుల తప్పిదాలను గుర్తించాం. కోర్టు ఆదేశాలను ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేయకపోవడం వల్లే సమస్య ఏర్పడింది. అధికారుల తప్పిదాలను సవరణ చేస్తున్నాం. నిజమైన కేసులు త్వరలోనే పరిష్కారం అవుతాయని అన్నారు.

## సొంత పార్టీపై కాంగ్రెస్ సీనియర్ నేత సంచలన ఆరోపణలు

**గత ఎన్నికల్లో డబ్బుల ఆశతోనే తనకు టికెట్ నిరాకరించారని విమర్శ**
**కాంగ్రెస్ జెండా మోయని వారికి ప్రాధాన్యం ఇవ్వడంపై అసంతృప్తి**
**పార్టీ వీడేది లేదు.. తప్పులను లోపల ఉంటూనే ప్రశ్నిస్తానని స్పష్టీకరణ**
**వనపర్తి అభివృద్ధికి విఘాతం కలిగిస్తున్నారని చిన్నారెడ్డి ఆవేదన**

**వనపర్తి, ఆగస్టు 17:** కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలను మరోసారి బయటపెడుతూ ఆ పార్టీ సీనియర్ నేత చిన్నారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తనకు టికెట్ దక్కకపోవడం వెనుక డబ్బు ప్రభావం ఉందని తీవ్ర ఆరోపణలు చేశారు. 45 ఏళ్లుగా కాంగ్రెస్ జెండా మోస్తూ పార్టీ నిర్మాణం కోసం కష్టపడిన తనను కాదని, పార్టీ కోసం పనిచేయని వారికి టికెట్లు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వనపర్తిలో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే నియోజకవర్గాన్ని సర్వనాశనం చేస్తున్నారనే బాధ కలుగుతోందన్నారు. గత ఎన్నికల్లో తనకు టికెట్ ఎందుకు ఇవ్వలేదనే విషయం తనకు తెలుసని చిన్నారెడ్డి వ్యాఖ్యానించారు. డబ్బుల ఆశతోనే తనకు అవకాశం దక్కకుండా చేశారని ఆరోపించారు. జీవితాంతం పార్టీ కోసం పనిచేసిన వారిని పక్కనపెట్టి, గతంలో కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరి, అక్కడ సంపాదించుకుని తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చిన వారికి ప్రాధాన్యం ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. "ఇదా కాంగ్రెస్ పార్టీ?.. ఇదా రాజకీయం?" అంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను దాదాపు 45 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్నానని చిన్నారెడ్డి గుర్తుచేశారు. కష్టకాలంలో పార్టీ జెండాను మోసిన కార్యకర్తలు, నాయకులకు సముచిత గుర్తింపు దక్కాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ అధికారంలో లేని సమయంలో మరో పార్టీలోకి వెళ్లి, తిరిగి అధికారం వచ్చే సమయంలో కాంగ్రెస్‌లోకి వచ్చిన వారికి అవకాశాలు కల్పిస్తే నిజమైన కార్యకర్తలకు ఏం సందేశం వెళ్తుందని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో తనకు అవకాశం ఇచ్చి ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపించి, రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రి పదవి దక్కి ఉంటే వనపర్తికి మహర్దశ వచ్చేదని చిన్నారెడ్డి వ్యాఖ్యానించారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లే అవకాశం తనకు ఉండేదన్నారు. ప్రస్తుతం వనపర్తిలో జరుగుతున్న పరిణామాలు తనను తీవ్రంగా బాధిస్తున్నాయని, నియోజకవర్గాన్ని సర్వనాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### 'మరో జీవన్‌రెడ్డిలా అయ్యేవాడిని'

పార్టీలో జరుగుతున్న పరిణామాలను తాను ఎంతోకాలంగా భరిస్తున్నానని చిన్నారెడ్డి పేర్కొన్నారు. అన్నింటినీ భరించి కాంగ్రెస్‌లో కొనసాగుతున్నానని, లేకపోతే మరో జీవన్‌రెడ్డిలా పార్టీకి దూరమయ్యే పరిస్థితి వచ్చేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌లో కొన్ని తప్పులు జరుగుతున్న మాట వాస్తవమేనని, వాటిని సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అయితే ఎన్ని ఇబ్బందులు ఎదురైనా కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదని చిన్నారెడ్డి స్పష్టం చేశారు. పార్టీలోనే ఉంటూ తప్పులను ప్రశ్నిస్తానని తేల్చిచెప్పారు. కాంగ్రెస్‌కు నష్టం చేసేలా వ్యవహరించే వారిని ఉపేక్షించబోమని, పార్టీకి అన్యాయం చేసేవారిని బయటకు పంపించే వరకు పోరాడతామని హెచ్చరించారు.

# పేదలకు కార్పొరేట్ వైద్యం.. అదే మా లక్ష్యం

- విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం
- 32 నెలల్లో ఆరోగ్యశ్రీకి 2,600 కోట్ల వ్యయం
- పేదల ఆరోగ్యం కోసం రూ.5,226 కోట్లు ఖర్చు
- ఆస్పత్రులు పూర్తయితే కొత్తగా 10 వేల పడకలు
- 2027 డిసెంబర్ 9 నాటికి ఉస్మానియా సహా ఆస్పత్రులన్నీ పూర్తి
- గత పాలకులు టిమ్స్‌లకు కొబ్బరికాయలు కొట్టి వదిలేశారు
- సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 17:** పేదవాడికి జబ్బు వస్తే అప్పులపాలు కాకూడదని, కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే నాణ్యమైన వైద్యం అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాపాలనలో విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. గత పాలకులు టిమ్స్ ఆస్పత్రులకు కొబ్బరికాయలు కొట్టి పనులను గాలికొదిలేశారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక వాటిని పూర్తి చేసేందుకు ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రి ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. "పేదల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తీసుకురావాలన్నదే మా సంకల్పం. ప్రైవేటు వైద్యం సామాన్యుడికి భారంగా మారిన పరిస్థితుల్లో ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతున్నాం" అని అన్నారు. గత 32 నెలల్లో ఆరోగ్యశ్రీ కోసం రూ.2,600 కోట్లు ఖర్చు చేశామని, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.2,526 కోట్లు అందించామని తెలిపారు. మొత్తంగా పేదల ఆరోగ్యం కోసం రూ.5,226 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. రెండేళ్లలో వైద్య, ఆరోగ్య శాఖ కోసం రూ.21,800 కోట్లు వెచ్చించామని చెప్పారు.

### 10 వేల పడకలు అందుబాటులోకి

సనత్‌నగర్‌తో పాటు ఎల్బీనగర్, అల్వాల్ టిమ్స్ ఆస్పత్రులు, వరంగల్ ఆస్పత్రి నిర్మాణాలను వేగంగా పూర్తి చేస్తున్నామని సీఎం తెలిపారు. కొత్త ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణంపైనా ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఇవన్నీ పూర్తయితే సుమారు 10 వేల పడకలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. "2027 డిసెంబర్ 9 నాటికి ఉస్మానియా, ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్ ఆస్పత్రులను పూర్తి చేస్తాం. ప్రతి ఆరు నెలలకు ఒక ఆస్పత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రణాళిక రూపొందించాం. ఒక్కో ఆస్పత్రికి ఒక్కో డైరెక్టర్‌ను నియమించి నిర్మాణం నుంచి నిర్వహణ వరకు పర్యవేక్షిస్తాం" అని సీఎం వెల్లడించారు.

### ఆస్పత్రుల నిర్వహణలోనూ కార్పొరేట్ ప్రమాణాలు

ప్రభుత్వ ఆస్పత్రుల నిర్వహణను కూడా కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతామని రేవంత్‌రెడ్డి తెలిపారు. రోగులతో వచ్చే సహాయకులు ఉండేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అదనపు సమయం సేవలందించే సూపర్ స్పెషాలిటీ వైద్యులకు ప్రోత్సాహకాలు అందించే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. వైద్యంతో పాటు విద్యారంగంలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామని సీఎం చెప్పారు. తెలంగాణ విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునే స్థాయిలో విద్యా వ్యవస్థను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని, అందుకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించాల్సి ఉందన్నారు.

### 'కొబ్బరికాయ కొట్టి వదిలేశారు'

గత ప్రభుత్వంపై సీఎం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ఉస్మానియా ఆస్పత్రి శిథిలావస్థకు చేరినా పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు కొత్త ఆస్పత్రి నిర్మాణం చేపట్టలేదు. టిమ్స్ ఆస్పత్రులు, వరంగల్ ఆస్పత్రికి కొబ్బరికాయలు కొట్టి వదిలేశారు. మేం అధికారంలోకి వచ్చాక వాటిని పూర్తి చేసేందుకు నిధులు కేటాయించి పనులను వేగవంతం చేశాం" అని అన్నారు. కేటీఆర్ ఇటీవల టిమ్స్ వద్దకు వచ్చి తామే నిర్మించామని చెప్పడంపైనా సీఎం వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "మీరు కట్టిందే అయితే పదేళ్లలో ప్రారంభించడానికి సమయం ఎందుకు దొరకలేదు? మీ కుటుంబానికి ఫామ్‌హౌస్‌లు నిర్మించుకోవడంలో ఆలస్యం కాలేదు. పేదలకు వైద్యం అందించే ఆస్పత్రులను మాత్రం ఎందుకు పూర్తి చేయలేకపోయారు?" అని ప్రశ్నించారు. కేసీఆర్, కేటీఆర్ తమ వైఖరిని మార్చుకోకుండా ఇలాగే ఉండాలని తాను కోరుకుంటున్నానని సీఎం ఎద్దేవా చేశారు. "వాళ్లు అబద్ధాలు చెప్పడం మాననంతకాలం నేను నిజాలు చెబుతూనే ఉంటా" అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో 'సర్' ముసాయిదా జాబితా విడుదల

- 78.30 శాతం ఎన్యూమరేషన్ పత్రాల స్వీకరణ
- 2.73 శాతం మంది మృతులుగా గుర్తింపు
- 60 లక్షల మంది ఓటర్ల వివరాల్లో అసమానతలు
- మ్యాపింగ్ కాని ఓటర్లు మరో 32 లక్షలు
- 92 లక్షల మందికి నోటీసులు జారీ చేసే అవకాశం
- అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా

**హైదరాబాద్, ఆగస్టు 17:** తెలంగాణలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో కీలక ఘట్టం పూర్తయింది. రాష్ట్రంలో 'సర్' ముసాయిదా ఓటర్ల జాబితాను ఎన్నికల అధికారులు విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఎన్యూమరేషన్ ప్రక్రియలో 78.30 శాతం పత్రాలు అందినట్లు అధికారులు వెల్లడించారు. పరిశీలనలో 2.73 శాతం మంది ఓటర్లు మృతి చెందినట్లు గుర్తించినట్టు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఓటర్ల వివరాల పరిశీలనలో పెద్ద సంఖ్యలో అసమానతలు వెలుగుచూశాయి. సుమారు 60 లక్షల మంది ఓటర్ల వివరాల్లో అనామలీస్ ఉన్నట్లు గుర్తించారు. మరో 32 లక్షల మంది ఓటర్లు మ్యాపింగ్ చేసుకోలేదని తేలింది. ఈ రెండు వర్గాలకు సంబంధించి దాదాపు 92 లక్షల మందికి నోటీసులు జారీ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించి తమ వివరాలను నిర్ధారించుకోవచ్చని సూచించారు. నోటీసు ఎందుకు జారీ చేశారన్న కారణాన్ని కూడా స్పష్టంగా తెలియజేస్తామని చెప్పారు. ఓటు తొలగింపు లేదా జాబితాలోని వివరాలపై అభ్యంతరాలు ఉన్నవారు నిర్ణీత గడువులో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

### అక్టోబర్ 15 వరకు అభ్యంతరాలు

ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు అభ్యంతరాలు, దరఖాస్తుల పరిశీలన కొనసాగనుంది. ఈ ప్రక్రియ పూర్తయిన అనంతరం అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రత్యేక సవరణ ప్రక్రియను పూర్తి చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా రెండు వేల మందికి పైగా అధికారులు పాల్గొంటారని వెల్లడించారు. ముసాయిదా జాబితాలో పేరు లేని అర్హులైన ఓటర్లు నిర్ణీత దరఖాస్తు ద్వారా తమ పేరును నమోదు చేసుకోవచ్చని అధికారులు సూచించారు. ముసాయిదా ఓటర్ల జాబితాను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.




## తెలంగాణలో 'సర్' ఎన్యూమరేషన్ పూర్తి

**2.65 కోట్ల మంది ఓటర్ల నుంచి పత్రాల స్వీకరణ**
**సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలకు చాన్స్**
**అర్హుడైన ఒక్క ఓటరూ జాబితా నుంచి తప్పిపోవద్దన్న సీఈవో సుదర్శన్‌రెడ్డి**

**హైదరాబాద్, ఆగస్టు 17:** తెలంగాణలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ-2026లో భాగంగా చేపట్టిన ఎన్యూమరేషన్ దశ విజయవంతంగా పూర్తయిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. జూన్ 25 నుంచి ఆగస్టు 10 వరకు నిర్వహించిన ఈ ప్రక్రియలో రాష్ట్రవ్యాప్తంగా 2.65 కోట్ల మంది ఓటర్ల నుంచి ఎన్యూమరేషన్ పత్రాలను సేకరించినట్లు తెలిపారు. ఇది మొత్తం ఓటర్లలో 78.30 శాతమని వివరించారు. సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి మీడియా సమావేశంలో సుదర్శన్‌రెడ్డి ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వివరాలను వెల్లడించారు. ఎన్యూమరేషన్ సమయంలో మరణించిన ఓటర్లు, వలస వెళ్లిన వారు, అందుబాటులో లేని లేదా గైర్హాజరైన వారు, ఇతర కేటగిరీలకు చెందిన ఓటర్లతో పాటు ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో ఓటర్ల జాబితాలో నమోదైన వారి వివరాలను గుర్తించినట్లు తెలిపారు.

### ముసాయిదా జాబితా విడుదల

ఎన్యూమరేషన్ దశ ముగియడంతో రాష్ట్రంలో ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించినట్లు సీఈవో తెలిపారు. ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ కొనసాగుతుందని చెప్పారు. ముసాయిదా జాబితాలో పేర్లు, ఇతర వివరాలకు సంబంధించి అభ్యంతరాలు ఉన్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సీఈవో సమాధానమిచ్చి సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం ముసాయిదా ఓటర్ల జాబితాకు సంబంధించిన సమాచారాన్ని మీడియాకు అందజేశారు.

### ఒక్క అర్హుడి ఓటూ తప్పిపోవద్దు

అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరు కూడా ఓటర్ల జాబితా నుంచి తప్పిపోకుండా చూడటమే ఎన్నికల యంత్రాంగం లక్ష్యమని సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాను ఖచ్చితమైనదిగా, సమగ్రంగా, పారదర్శకంగా, లోపరహితంగా రూపొందించేందుకు రాజకీయ పార్టీలు, ఓటర్లు, మీడియా సహా అన్ని వర్గాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ అదనపు కార్యదర్శి ఎన్. శంకర్, డిప్యూటీ సీఈవో జి.ఎస్. చారి, ఎన్. ప్రసూనాంబ, నోడల్ అధికారులు, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రత, రక్షణ, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం

- ఆహారం, ఔషధాల నాణ్యతపై కఠిన నిఘా
- ఏకీకృత వ్యవస్థగా 'తెలంగాణ సేఫ్' ఏర్పాటు
- నిబంధనలు ఉల్లంఘిస్తే తక్షణ చర్యలు
- 'ఎక్స్' వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, ఆగస్ట్ 17:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యతలను, ప్రజారోగ్య పరిరక్షణ దిశగా తీసుకున్న నూతన నిర్ణయాన్ని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజల భద్రత, రక్షణ, సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి అంశంలోనూ చట్టం ప్రకారమే పాలన సాగిస్తూ, ప్రజలకు సంపూర్ణ జవాబుదారీతనంతో సేవలు అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన సంకల్పమని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో ఆహార పదార్థాలు, నిత్యవసర ఔషధాల నాణ్యతను, భద్రతను పర్యవేక్షించేందుకు ఏకీకృత వ్యవస్థగా 'తెలంగాణ సేఫ్' తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్‌ను అమలులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు వేర్వేరుగా ఉన్న ఆహార భద్రత, ఔషధ నియంత్రణ విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి, ప్రజారోగ్య పరిరక్షణకు ఈ నూతన అథారిటీ ద్వారా కఠిన ప్రమాణాలు అమలు చేయనున్నట్లు తెలియజేశారు. దీని ద్వారా మార్కెట్లో లభించే ఆహార పదార్థాల్లో కల్తీని నిరోధించడం, నకిలీ , ప్రమాదకర మందుల విక్రయాలకు అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది. క్షేత్రస్థాయిలో తనిఖీలు పెరిగి, నాణ్యతా ప్రమాణాలు పాటించని వారిపై తక్షణ చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వీలవుతుంది. ఫలితంగా పౌరులకు సురక్షితమైన ఆహారం, సమర్థవంతమైన మందులు అందుబాటులోకి వచ్చి, ప్రజారోగ్యానికి సంపూర్ణ భద్రత చేకూరుతుంది. నాణ్యమైన ఆహారం, సురక్షితమైన మందులు అందించడమే లక్ష్యంగా పనిచేసే '÷ఉ-÷ూజౌ।' సేవలను ఉపయోగించుకుంటూ, ఆరోగ్యవంతమైన, సురక్షితమైన తెలంగాణ నిర్మాణంలో రాష్ట్ర పౌరులందరూ భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.



చురకలు

మంగళవారం 18.08.2026

# 22ఏతో దోపిడీ.. తప్పు బయటపడితే 'సారీ'!

- సర్కార్ నడుపుతున్నారా.. సర్కస్ నడుపుతున్నారా?
- ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టి గందరగోళం సృష్టించారు
- సీఎం ఇంటికే సెగ తగిలాక ప్రభుత్వంలో చురుకు
- తప్పులు సర్కార్‌వి.. అధికారులను బలి చేయడం ఎందుకు?
- కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పైనా పేదల్లో ఆందోళన
- 22ఏ వ్యవహారంపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్
- కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు, బీఆర్‌ఎస్ తీవ్రస్థాయిలో ధ్వజం



**హైదరాబాద్, ఆగస్టు 17:** "సర్కార్ నడుపుతున్నారా.. సర్కస్ నడుపుతున్నారా? తప్పులు ప్రభుత్వం చేస్తే అధికారులు బలి కావాలా? ప్రజల జీవితాలు, ఆస్తులతో ముడిపడిన అంశాల్లో ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకుని.. వ్యవహారం బయటపడగానే 'సారీ' చెప్పి చేతులు దులుపుకుంటారా?" అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. 22ఏ నిషేధిత భూముల వ్యవహారంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను గందరగోళంలోకి నెట్టారని ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించగా, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల విషయంలోనూ ప్రభుత్వ తప్పులను అధికారులపై నెట్టే ప్రయత్నం జరుగుతోందని బీఆర్‌ఎస్ మండిపడింది. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. 22ఏ సెక్షన్ పేరుతో ప్రైవేటు భూములను అడ్డగోలుగా నిషేధిత జాబితాలో చేర్చారని ఆరోపించారు. ఎవరి భూమి 22ఏలో ఉందో, ఎవరిది లేదో తెలియక రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ఆస్తుల యజమానులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. దేశవ్యాప్తంగా 1999లోనే అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని రద్దు చేశారని, ఉమ్మడి రాష్ట్రంలో 2008లో అప్పటి ప్రభుత్వం ఆ చట్టాన్ని పూర్తిగా ఎత్తివేసిందని హరీశ్‌రావు గుర్తుచేశారు. అప్పట్లోనే సీలింగ్ పరిధి నుంచి బయటపడి క్లియర్ అయిన భూములను ఇప్పుడు తిరిగి 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వానికి పాలనపై పట్టు లేదనడానికి ఇదే పెద్ద నిదర్శనమని విమర్శించారు.

### ఎయిర్‌పోర్టు.. ఔటర్ రింగ్ రోడ్డు కూడా జాబితాలో!

ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగ్ రోడ్డు వంటి ఆస్తులు కూడా 22ఏ జాబితాలోకి వచ్చాయంటే వ్యవస్థ ఎంత గందరగోళంగా మారిందో అర్థం చేసుకోవచ్చని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో లక్షలాది ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చారని ఆరోపించారు. శ్రీనగర్ కాలనీలోని సర్వే నంబర్లు 8, 9లో రెండు దశాబ్దాలుగా ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న వారి ఆస్తులు, మూడు దశాబ్దాల క్రితం కొనుగోలు చేసిన అపార్ట్‌మెంట్ స్థలాలు కూడా జాబితాలోకి వచ్చాయని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ కోసం చలాన్లు కట్టి, రుసుములు చెల్లించిన తర్వాత చివరి నిమిషంలో భూమి 22ఏ పరిధిలో ఉందంటూ రిజిస్ట్రేషన్ నిలిపివేస్తున్నారని ఆరోపించారు. చెల్లించిన చలాన్ సొమ్ము కూడా తిరిగి ఇవ్వకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. గతంలో ప్రభుత్వ అనుమతులు ఉన్న భూములకు బ్యాంకులు రుణాలు ఇచ్చాయని, ఇప్పుడు అవే ఆస్తులు నిషేధిత జాబితాలోకి రావడంతో ప్రజలతో పాటు బ్యాంకులు కూడా ఇబ్బందుల్లో పడుతున్నాయని అన్నారు.

### '30 శాతం కమిషన్' ఆరోపణ

22ఏ వ్యవహారం ప్రజల నుంచి డబ్బులు దండుకునే ఆయుధంగా మారిందని హరీశ్‌రావు ఆరోపించారు. నిషేధిత జాబితా నుంచి భూమిని బయటకు తీయాలంటే 30 శాతం కమిషన్ ఇవ్వాల్సి వస్తోందన్న ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. "ఈ ఆస్తులను జాబితాలో పెట్టింది ఎవరు? తొలగిస్తున్నది ఎవరు? దీని వెనుక ఎవరున్నారు?" అంటూ సమగ్ర విచారణకు డిమాండ్ చేశారు.

### సీఎం ఇంటికి సెగ తగిలాకే చురుకు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసం కూడా 22ఏ నిషేధిత జాబితాలోకి వచ్చిందని, తన ఇంటికి సెగ తగిలిన తర్వాతే ప్రభుత్వంలో హడావిడి మొదలైందని హరీశ్‌రావు ఆరోపించారు. "మీకు చురుకు తగిలితేనే సామాన్యుల బాధలు గుర్తుకొస్తాయా? ముఖ్యమంత్రి పరిస్థితే ఇలా ఉంటే సామాన్య ప్రజల గోడు ఎవరు పట్టించుకుంటారు?" అని ప్రశ్నించారు. ముందు ఆస్తులను అడ్డగోలుగా 22ఏలో చేర్చి, ఇప్పుడు జీవోలు తెస్తాం.. సమీక్షలు చేస్తాం అంటూ కాలయాపన చేయడం ఎందుకని నిలదీశారు. తప్పు జరిగిందని ప్రభుత్వం అంగీకరించినప్పుడు వెంటనే ఆ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

### తప్పు సర్కార్‌ది.. బలి అధికారులా?

ఇదే సమయంలో ప్రభుత్వ తీరుపై బీఆర్‌ఎస్ మరింత ఘాటుగా స్పందించింది. "సర్కార్ నడుపుతున్నారా.. లేక సర్కస్ నడుపుతున్నారా రేవంత్‌రెడ్డి? మీ తప్పులకు ప్రభుత్వ అధికారులు బలి కావాలా? తప్పు మీరు చేస్తే శిక్ష వారు అనుభవించాలా?" అని ప్రశ్నించింది. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిలిపివేసే ప్రయత్నం జరుగుతోందన్న ఆరోపణలు రావడంతో మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులపై నెపం నెట్టే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్‌ఎస్ ఆరోపించింది. 22ఏ వ్యవహారం వివాదాస్పదం కావడంతో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్షమాపణ చెప్పి, అధికారుల పొరపాటుగా పేర్కొనడం కూడా బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నమేనని విమర్శించింది.

### 'సారీ'తో సమస్యలు తీరవు

ప్రజల జీవితాలతో ముడిపడిన అంశాల్లో తప్పులు చేసి కేవలం క్షమాపణ చెబితే సరిపోదని బీఆర్‌ఎస్ పేర్కొంది. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు కొనసాగుతాయో లేదోనని పేద కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయని, మరోవైపు 22ఏ వ్యవహారంతో ఆస్తుల యజమానులు మానసిక వేదనకు గురవుతున్నారని తెలిపింది. "అధికారులపై మీరు సీరియస్‌గా ఉండటం కాదు.. తెలంగాణ ప్రజలే మీ ప్రభుత్వంపై సీరియస్‌గా ఉన్నారు. సరైన సమయంలో ప్రజలే సమాధానం చెబుతారు" అని బీఆర్‌ఎస్ హెచ్చరించింది.

### 22ఏపై శ్వేతపత్రం విడుదల చేయాలి

2023 డిసెంబర్ 7 నుంచి ఇప్పటివరకు 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన, తొలగించిన భూముల వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మొత్తం వ్యవహారంపై శ్వేతపత్రం విడుదల చేసి నిజాలను ప్రజల ముందు ఉంచాలని కోరారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలు ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిచిపోకూడదని బీఆర్‌ఎస్ స్పష్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా పొరపాటుగా 22ఏ నిషేధిత జాబితాలో చేరిన నిజమైన భూహక్కుదారుల ఆస్తులను వెంటనే తొలగించి, యజమానులకు పూర్తి హక్కులు కల్పించాలని డిమాండ్ చేసింది.

# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ఆగవు

- పథకాల కొనసాగింపునకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- గత ప్రభుత్వ లోపభూయిష్ట జీవోలతోనే న్యాయపరమైన చిక్కులు
- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులపై డివిజన్ బెంచ్‌కు అప్పీల్
- గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులు విడుదల చేస్తున్నాం
- ధర్నాలు చేసేవారు ముందు గత తప్పిదాలపై మాట్లాడాలి
- మీడియా సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి




**హైదరాబాద్, ఆగస్టు 17:** కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిలిపివేసే ప్రసక్తే లేదని, పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలిచే ఈ పథకాలను కొనసాగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వం పథకాల అమలుకు సంబంధించి పక్కాగా ఉత్తర్వులు జారీ చేయకపోవడం వల్లే ప్రస్తుతం న్యాయపరమైన చిక్కులు తలెత్తాయని అన్నారు. హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై డివిజన్ బెంచ్‌ను ఆశ్రయిస్తున్నామని, సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. కళ్యాణలక్ష్మి పథకానికి సంబంధించి ఇప్పటివరకు జారీ చేసిన ఎనిమిది జీవోలను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైందన్నారు. దీనిపై విచారణ సందర్భంగా మధ్యంతర ఉత్తర్వులు వెలువడ్డాయని చెప్పారు. వచ్చే నెల 9 వరకు సమయం ఉన్నప్పటికీ అంతవరకు వేచి చూడకుండా, పేదలకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో వెంటనే డివిజన్ బెంచ్‌ను ఆశ్రయిస్తున్నామని వివరించారు. "కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎత్తివేయాలని మా ప్రభుత్వం ఎప్పుడూ ఆలోచించలేదు. ఇవి పేద కుటుంబాలకు అండగా నిలిచే సంక్షేమ పథకాలు. ఆడబిడ్డ వివాహ సమయంలో కుటుంబంపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించడమే వీటి ఉద్దేశం. రాజకీయాలకు అతీతంగా పేదల ప్రయోజనాల కోసం వాటిని కొనసాగిస్తాం" అని పొన్నం స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిధుల విడుదలలోనూ ఇబ్బందులు ఉండేవని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులు విడుదల చేస్తున్నామని తెలిపారు. పేదలకు నష్టం కలగకుండా న్యాయపరంగా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను ప్రభుత్వం వినియోగించుకుంటుందని చెప్పారు. ప్రస్తుత పరిస్థితికి మూలం 2014లో గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఉత్తర్వుల్లోని లోపాలేనని పొన్నం ఆరోపించారు. అప్పుడే పక్కాగా, న్యాయపరమైన చిక్కులు లేకుండా జీవోలు జారీ చేసి ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. గతంలో జరిగిన తప్పిదాలను సరిచేసి పథకం నిరాటంకంగా కొనసాగేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కోర్టులో ప్రభుత్వం తరఫున కౌంటర్ దాఖలు చేసే విషయంలో ఎక్కడ లోపం జరిగిందనే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నామని తెలిపారు. అధికారుల స్థాయిలో పొరపాటు జరిగిందా? ప్రభుత్వ న్యాయ వ్యవహారాలను చూసే విభాగంలో లోపం జరిగిందా? అనే అంశంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ధర్నాలు చేసేవారు ముందు దీనికి సమాధానం చెప్పాలి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పై రోడ్లెక్కి నిరసనలు చేస్తున్న ప్రతిపక్ష నాయకులు ముందుగా గత ప్రభుత్వం జారీ చేసిన జీవోల్లోని లోపాలపై సమాధానం చెప్పాలని పొన్నం డిమాండ్ చేశారు. "మీరు చేసిన తప్పుల కారణంగానే పథకానికి న్యాయపరమైన చిక్కులు వచ్చాయి. అయినప్పటికీ మేం పథకాన్ని ఆపకుండా కొనసాగిస్తున్నాం. ఇప్పుడు ధర్నాలు చేస్తూ ప్రభుత్వంపై నిందలు వేయడం సరికాదు" అని విమర్శించారు. బహుజన పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరిస్తారని పొన్నం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, బలహీన వర్గాలు, కుల సంఘాల నాయకులు పాల్గొంటారని చెప్పారు. ఇటీవలే ట్యాంక్‌బండ్ సమీపంలో మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించుకున్నామని గుర్తుచేశారు.

# ఇక మండలస్థాయిలోనే ప్రజావాణి ఫిర్యాదులు

### గోవిందరావుపేటలో ప్రారంభించిన సీతక్క



**ములుగు, ఆగస్ట్ 17:** ప్రజల సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమాన్ని గోవిందరావుపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో మంత్రి సీతక్క సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వివిధ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. గతంలో ప్రజలు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రతి సోమవారం ములుగు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదని మంత్రి తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి మండల కేంద్రంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇకపై గోవిందరావుపేట మండల ప్రజలు సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానిక అధికారులకు దరఖాస్తులు అందజేయవచ్చని తెలిపారు. ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యలను స్వీకరించి, పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని మంత్రి సీతక్క సూచించారు. ఎమ్మార్వో సృజన్‌కుమార్, ఎంపీడీవో వరుణ్‌కుమార్‌లు ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో సృజన్‌కుమార్, ఎంపీడీవో వరుణ్‌కుమార్, వ్యవసాయ అధికారి జితేందర్, మండల విద్యాధికారి దివాకర్, మార్కెట్ చైర్మన్ కళ్యాణి, గ్రంథాలయ చైర్మన్ రవిచందర్, గోవిందరావుపేట మండల సహకార సంఘం చైర్మన్ పన్నాల ఎల్లారెడ్డి, పస్రా సర్పంచ్ సుమలతతో పాటు వివిధ శాఖల అధికారులు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



# గర్భం దాల్చిందని ప్రియురాలి హత్య!

### పెళ్లి చేసుకోవాలని కోరడంతో అడ్డు తొలగించుకునే పథకం
### బిహార్‌కు చెందిన యువతి దారుణ హత్య
### గోనె సంచిలో మృతదేహం తరలిస్తుండగా స్థానికులకు అనుమానం
### ప్రియుడు అహ్మద్‌తో పాటు తల్లిదండ్రుల అదుపు
### బాలాపూర్‌లో కలకలం రేపిన ఘటన

**హైదరాబాద్, ఆగస్టు 17:** ప్రేమ పేరుతో దగ్గరయ్యాడు.. యువతి గర్భం దాల్చడంతో పెళ్లి చేసుకోవాలని కోరింది. దీంతో ఆమెను జీవిత భాగస్వామిగా చేసుకోవాల్సిన ప్రియుడే అడ్డు తొలగించుకునేందుకు హత్యకు పాల్పడినట్లు ఆరోపణలు రావడం కలకలం రేపింది. హైదరాబాద్‌లోని బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బిహార్‌కు చెందిన ఓ యువతి దారుణ హత్యకు గురైంది. ఈ ఘటనలో ఆమె ప్రియుడు అహ్మద్‌తో పాటు అతడి తల్లిదండ్రుల పాత్రపైనా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బిహార్‌కు చెందిన యువతి ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చి బాలాపూర్ ప్రాంతంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పనిచేస్తోంది. ఈ క్రమంలో బాలాపూర్‌కు చెందిన అహ్మద్ ఆమెకు పరిచయమయ్యాడు. ఆ పరిచయం ప్రేమగా మారింది. కొంతకాలంగా ఇద్దరూ సన్నిహితంగా ఉన్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఇటీవల తాను గర్భం దాల్చిన విషయాన్ని యువతి అహ్మద్‌కు చెప్పినట్లు సమాచారం. తనను పెళ్లి చేసుకోవాలని ఆమె కోరడంతో ఇద్దరి మధ్య వాగ్వాదాలు జరిగినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో యువతిని అడ్డు తొలగించుకోవాలని అహ్మద్ నిర్ణయించుకున్నాడని, హత్యకు పథకం రూపొందించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో అతడి తల్లిదండ్రుల ప్రమేయం ఉందా అనే కోణంలోనూ విచారణ కొనసాగిస్తున్నారు.

### గోనె సంచిలో మృతదేహం

ఆదివారం రాత్రి యువతి మృతదేహాన్ని గోనె సంచిలో పెట్టి తరలించే ప్రయత్నం చేయడంతో స్థానికులకు అనుమానం వచ్చింది. వారి కదలికలను గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అహ్మద్‌తో పాటు అతడి తల్లిదండ్రులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. క్లూస్ టీమ్‌తో ఘటనా స్థలంలో ఆధారాలను సేకరించిన పోలీసులు యువతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. హత్య ఎలా జరిగింది, ఇందులో ఎవరెవరి పాత్ర ఉంది, యువతి గర్భవతి అన్న విషయం వైద్య పరీక్షల్లో నిర్ధారణ అవుతుందా తదితర అంశాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# రాజన్న ఆలయంలో విజిలెన్స్ సోదాలు

### మూడు బృందాలుగా విడిపోయి ఆకస్మిక తనిఖీలు
### ఆరు గంటలుగా విభాగాల వారీగా రికార్డుల పరిశీలన
### లీజులు, అన్నదానం, గోదాం, లడ్డూ ప్రసాదంపై ప్రత్యేక దృష్టి
### పలు కీలక రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం
### విజిలెన్స్ తనిఖీలతో ఆలయ అధికారుల్లో కలకలం

**వేములవాడ, ఆగస్టు 17:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టడం కలకలం రేపింది. ఇద్దరు సీఐలు, ఒక తహసీల్దార్‌తో పాటు ఇతర అధికారులతో కూడిన పదిమంది బృందం మూడు బృందాలుగా విడిపోయి ఆలయంలోని వివిధ విభాగాల్లో సుమారు ఆరు గంటలపాటు విస్తృతంగా తనిఖీలు నిర్వహించింది. ప్రధానంగా ఆరోపణలు వచ్చిన విభాగాలపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. విచారణ కార్యాలయం, గదుల నిర్వహణ, లీజులు, అన్నదానం, గోదాం, లడ్డూ ప్రసాదం, ప్రజాసంబంధాల కార్యాలయం తదితర విభాగాల్లోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆదాయ, వ్యయ వివరాలతో పాటు ఆయా విభాగాల నిర్వహణకు సంబంధించిన దస్త్రాలను తనిఖీ చేసినట్లు తెలిసింది. ఆరోపణలపై లోతైన విచారణ చేపట్టేందుకు కొన్ని కీలక రికార్డులు, దస్త్రాలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. వాటిని పరిశీలించిన అనంతరం ఏవైనా అవకతవకలు జరిగాయా? నిబంధనల ఉల్లంఘన చోటుచేసుకుందా? అనే అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. విజిలెన్స్ అధికారులు ఒక్కసారిగా ఆలయంలో తనిఖీలు చేపట్టడంతో అధికారుల్లో కలకలం నెలకొంది. సోమవారం రాత్రి వరకు తనిఖీలు కొనసాగే అవకాశం ఉందని, పరిశీలించాల్సిన విభాగాలు మిగిలితే మరుసటి రోజు కూడా సోదాలు కొనసాగించే అవకాశం ఉన్నట్లు సమాచారం.



## సంపాదకీయం



# సౌరశక్తితోనే ఇంధన స్వావలంబన!

**విదేశీ ఇంధనంపై ఆధారపడే పరిస్థితికి స్వస్తి పలకాలి**

**సముద్ర మథనంతో చమురు, సహజవాయువు అన్వేషణ వేగవంతం కావాలి**

**సౌర విద్యుత్‌ను చౌకగా అందుబాటులోకి తెచ్చే పరిశోధనలు పెరగాలి**

**దేశీయ ఉత్పత్తి పెరిగితేనే అంతర్జాతీయ సంక్షోభాల నుంచి రక్షణ**

దేశం అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించాలని, విదేశాలపై ఆధారపడే పరిస్థితిని క్రమంగా తగ్గించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోట నుంచి ఇచ్చిన సందేశం ఆలోచింపజేసేదిగా ఉంది. అయితే స్వయం సమృద్ధి అన్నది నినాదంగా మిగిలిపోకూడదు. దానిని ఆచరణలోకి తీసుకురావాల్సిన బాధ్యత పాలకులపైనే ఉంది. ముఖ్యంగా ఇంధనం, ఆహార రంగాల్లో భారత్ మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉంది. 140 కోట్లకు పైగా జనాభా ఉన్న భారత్ తన ముడిచమురు అవసరాల్లో అత్యధిక భాగాన్ని దిగుమతుల ద్వారానే సమకూర్చుకుంటోంది. సహజవాయువు, పెట్రోలియం ఉత్పత్తుల కోసం విదేశాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఫలితంగా ప్రపంచంలో ఎక్కడ యుద్ధం వచ్చినా, చమురు సరఫరాలో అంతరాయం ఏర్పడినా దాని ప్రభావం మన ఆర్థిక వ్యవస్థపై పడుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరిగితే దేశీయంగా రవాణా నుంచి నిత్యావసర వస్తువుల వరకు ధరలపై ప్రభావం కనిపిస్తోంది. అందుకే దేశంలో అందుబాటులో ఉన్న సహజ వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి. సముద్ర ప్రాంతాల్లో చమురు, సహజవాయువు నిల్వల కోసం శాస్త్రీయ అన్వేషణ మరింత విస్తృతంగా సాగాలి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ప్రస్తావించిన సముద్ర మథన కార్యక్రమాన్ని ఈ కోణంలోనే చూడాలి. సముద్ర గర్భంలోని ఇంధన వనరులను గుర్తించగలిగితే విదేశీ దిగుమతులపై ఆధారపడే పరిస్థితిని కొంతైనా తగ్గించుకోవచ్చు. అయితే సముద్రంలో అన్వేషణ చేపట్టినంత మాత్రాన చమురు, సహజవాయువు నిల్వలు తప్పనిసరిగా లభిస్తాయని చెప్పలేం. లోతైన సముద్రాల్లో అన్వేషణ అత్యంత ఖర్చుతో కూడుకున్నది. సాంకేతికంగా కూడా అనేక సవాళ్లు ఎదు-రవుతాయి. అందుకే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ పరిశోధనలు, సమగ్ర భౌగోళిక సమాచారం ఆధారంగా ముందుకు సాగాల్సి ఉంటుంది. ఇక్కడే ప్రత్యామ్నాయ ఇంధన వనరుల ప్రాధాన్యం పెరుగుతోంది. భారత్‌కు ప్రకృతి ప్రసాదించిన అతిపెద్ద ఇంధన వనరు సూర్యరశ్మి. దేశంలోని అత్యధిక ప్రాంతాల్లో ఏడాదిలో ఎక్కువ రోజులు సూర్యరశ్మి అందుబాటులో ఉంటుంది. దీనిని పూర్తిస్థాయిలో వినియోగించుకోగలిగితే విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చు. సౌర విద్యుత్ ఉత్పత్తిని భారీ ప్రాజెక్టులకే పరిమితం చేయకుండా ప్రతి ఇంటికీ విస్తరించాలి. ఇళ్ల పైకప్పులు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, పరిశ్రమలు, వ్యవసాయ క్షేత్రాల్లో సౌర విద్యుత్ వ్యవస్థలను పెద్దఎత్తున ప్రోత్సహించాలి. రైతులకు సౌర పంపుసెట్లు విస్తృతంగా అందుబాటులోకి తీసుకొస్తే వ్యవసాయ విద్యుత్ అవసరాల్లో గణనీయమైన మార్పు సాధ్యమవుతుంది. అదే సమయంలో సౌర విద్యుత్ ఉత్పత్తితోనే సరిపెట్టకుండా నిల్వ సామర్థ్యంపైనా దృష్టి పెట్టాలి. తక్కువ ధరకు ఎక్కువ విద్యుత్‌ను నిల్వ చేయగల బ్యాటరీ సాంకేతికతను దేశీయంగా అభివృద్ధి చేసుకోవాలి. సౌర పలకలు, బ్యాటరీలు, విద్యుత్ వాహనాలకు అవసరమైన కీలక పరికరాల తయారీలోనూ భారత్ స్వయం సమృద్ధి సాధించాలి. లేకపోతే పెట్రోలియం దిగుమతుల స్థానంలో సౌర పరికరాల కోసం మరోసారి విదేశాలపై ఆధారపడే ప్రమాదం ఉంటుంది. బయో ఇంధనాలు, హరిత హైడ్రోజన్, జలవిద్యుత్, పవన విద్యుత్, అణు విద్యుత్ వంటి ప్రత్యామ్నాయ మార్గాలను కూడా సమాంతరంగా అభివృద్ధి చేయాలి. ఒకే ఇంధన వనరుపై ఆధారపడకుండా విభిన్న వనరులతో బలమైన ఇంధన వ్యవస్థను నిర్మించుకోవడమే దేశ ప్రయోజనాలకు మంచిది. ఆహార రంగంలోనూ ఇదే విధానం అవసరం. పప్పులు, వంటనూనెల వంటి నిత్యావసరాల దిగుమతులను తగ్గించేలా దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించాలి. రైతుకు గిట్టుబాటు ధర, సాగుకు అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తే దిగుమతులను తగ్గించుకునే అవకాశం ఉంటుంది. స్వయం సమృద్ధి అంటే ప్రపంచంతో సంబంధాలు తెంచుకోవడం కాదు. మనకు అవసరమైన కీలక వస్తువులు, ఇంధనం, ఆహారం విషయంలో ప్రపంచంలో ఎలాంటి సంక్షోభం వచ్చినా దేశ ప్రజలు ఇబ్బందులు పడకుండా నిలబడగల సామర్థ్యాన్ని పెంచుకోవడం. అందుకు దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం. సూర్యుడు మనకు ప్రతి రోజూ ఉచితంగా ఇంధనాన్ని అందిస్తున్నాడు. దానిని విద్యుత్తుగా మార్చుకునే సాంకేతికతను మరింత చౌకగా, సమర్థంగా అభివృద్ధి చేసుకోగలిగితే భారత ఇంధన స్వావలంబనకు అదే అతిపెద్ద ముందడుగు అవుతుంది. సౌరశక్తిలో స్వయం సమృద్ధి సాధిస్తేనే భవిష్యత్తులో ఇంధన భద్రతకు బలమైన పునాది పడుతుంది.

# అశోక్‌ధామ్‌లో తొక్కిసలాట..

## ఏడుగురు భక్తుల దుర్మరణం

- విద్యుత్ తీగ పడిందన్న భయంతో పరుగులు
- ఒకరిపై మరొకరు పడిన భక్తులు
- పలువురికి గాయాలు.. ఆసుపత్రికి తరలింపు
- మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున పరిహారం
- ఘటనపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి



**పాట్నా, ఆగస్టు 17:** బీహార్‌లోని లఖిసరాయ్ జిల్లా అశోక్‌ధామ్ ఆలయంలో సోమవారం జరిగిన తొక్కిసలాట తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటనలో ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారు. శ్రావణ మాసం సోమవారం కావడంతో శివుడికి జలాభిషేకం చేసేందుకు వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. దర్శనం కోసం మహిళలు, పురుషులు వేర్వేరు వరుసల్లో వేచి ఉన్న సమయంలో పురుషుల వరుస సమీపంలో ఓ




విద్యుత్ స్తంభం అకస్మాత్తుగా కూలిపోయినట్లు అధికారులు తెలిపారు. స్తంభానికి ఉన్నది కేబుల్ తీగ అయినప్పటికీ విద్యుత్ తీగ తెగిపడిందన్న ప్రచారం భక్తుల్లో భయాందోళనకు కారణమైనట్లు ప్రాథమికంగా గుర్తించారు. విద్యుత్ షాక్ తగులుతుందనే భయంతో భక్తులు ఒక్కసారిగా పరుగులు తీయడంతో బారికేడ్లు కూలిపోయాయి. ఈ క్రమంలో ఒకరిపై మరొకరు పడిపోవడంతో తొక్కిసలాట జరిగింది. కేవలం రెండు నిమిషాల వ్యవధిలోనే ఏడుగురు ప్రాణాలు కోల్పోగా, 12 మందికి పైగా గాయపడినట్లు లఖిసరాయ్ జిల్లా మేజిస్ట్రేట్ శైలేంద్ర కుమార్ వెల్లడించారు. క్షతగాత్రులను వెంటనే సదర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఘటనకు దారితీసిన పరిస్థితులపై పూర్తి స్థాయిలో విచారణ జరిపిన అనంతరం వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

### మృతుల కుటుంబాలకు రూ.4 లక్షలు

ఘటనపై బీహార్ ప్రభుత్వం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించింది.

### ప్రధాని మోదీ సంతాపం

అశోక్‌ధామ్ తొక్కిసలాటలో భక్తులు ప్రాణాలు కోల్పోవడంపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితులకు స్థానిక యంత్రాంగం అవసరమైన సహాయాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఎన్‌టీఏ తప్పులకు విద్యార్థుల మూల్యం

- మండిపడ్డ రాహుల్ గాంధీ
- యూజీసీ-నెట్ పరీక్షల రద్దుపై ఆగ్రహం
- సుప్రీంకోర్టులో రాహుల్ గాంధీకి ఊరట
- జార్ఖండ్ విద్యార్థులను కలవాలని సీఎం సోరెన్‌కు లేఖ



**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) తీరుపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యూజీసీ-నెట్ పరీక్షల్లో సోషియాలజీ, ఇంగ్లిష్, కామర్స్ పరీక్షలను రద్దు చేసి సెప్టెంబర్‌లో మళ్లీ నిర్వహించాలనే నిర్ణయంపై ఆయన మండిపడ్డారు. ఎన్‌టీఏ చేసిన తప్పులకు వేలాది మంది విద్యార్థులు నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి కష్టపడి సిద్ధమైన అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవడం, ఫీజులు చెల్లించడం, దూర ప్రాంతాలకు ప్రయాణించడం తీవ్రమైన మానసిక, ఆర్థిక భారమని విమర్శించారు. ప్రస్తుత విద్యా వ్యవస్థ విద్యార్థుల సమయం, డబ్బు, ఆత్మవిశ్వాసాన్ని హరించివేస్తోందని, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### సుప్రీంకోర్టులో రాహుల్‌కు బిగ్ రిలీఫ్

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో కీలక ఊరట లభించింది. అలహాబాద్ హైకోర్టులో కొనసాగుతున్న విచారణను తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు నిలిపివేస్తూ సుప్రీంకోర్టు స్టే విధించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చి, వి. మోహనాలతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. అలాగే ఈ వ్యవహారంపై సీబీఐ, ఈడీ ఎలాంటి నివేదికలను హైకోర్టుకు సమర్పించకూడదని స్పష్టం చేసింది.

### విద్యార్థులతో చర్చించండి: సీఎం లేఖ

జార్ఖండ్‌లో ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ ఆందోళన చేస్తున్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని రాహుల్ గాంధీ కోరారు. ఈ మేరకు జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు ఆయన లేఖ రాశారు. జేపీఎస్సీ, జేఎస్ఎస్సీ నిర్వహించిన పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకేజీ, పారదర్శకత లోపించడంపై రాంచీలో విద్యార్థులు గత 24 రోజులుగా నిరసనలు తెలుపుతున్నారు. నిరసన తెలుపుతున్న అభ్యర్థుల డిమాండ్లు న్యాయమైనవని, సీఎం స్వయంగా వారిని కలిసి చర్చల ద్వారా సమస్యను పరిష్కరించాలని రాహుల్ లేఖలో విజ్ఞప్తి చేశారు.



# ఎంపీ, ఎమ్మెల్యేలపై 4,192 క్రిమినల్ కేసులు

**పదేళ్లు దాటినా తేలని 519 కేసులు**

**ఐదు నుంచి పదేళ్లుగా పెండింగ్‌లో మరో 754**

**సిట్టింగ్ ఎంపీలపై 335.. ఎమ్మెల్యేలపై 1,222 కేసులు**

**700 కేసుల్లో ఇంకా పూర్తికాని దర్యాప్తు**

**సుప్రీంకోర్టుకు అమికస్ క్యూరీ 22వ నివేదిక**

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** దేశవ్యాప్తంగా ఎంపీలు, ఎమ్మెల్యేలపై నమోదైన క్రిమినల్ కేసుల విచారణ ఏళ్ల తరబడి సాగుతోంది. ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులకు సంబంధించిన 4,192 క్రిమినల్ కేసులు ఇంకా పెండింగ్‌లో ఉన్నట్లు అమికస్ క్యూరీ సుప్రీంకోర్టుకు వెల్లడించారు. వీటిలో ఏకంగా 519 కేసులు పదేళ్లకు పైగా పెండింగ్‌లో ఉండటం గమనార్హం. మరో 754 కేసులు ఐదు నుంచి పదేళ్లుగా విచారణ దశలోనే ఉన్నట్లు తెలిపారు. ఎంపీలు, ఎమ్మెల్యేలపై నమోదైన క్రిమినల్ కేసుల సత్వర విచారణకు సంబంధించిన వ్యవహారంలో అమికస్ క్యూరీ తాజాగా సుప్రీంకోర్టుకు 22వ నివేదిక సమర్పించారు. నివేదిక ప్రకారం ప్రస్తుతం పదవుల్లో ఉన్న ఎంపీలపై 335 కేసులు, ఎమ్మెల్యేలపై 1,222 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. మాజీ ఎంపీలపై 269, మాజీ ఎమ్మెల్యేలపై 1,339 క్రిమినల్ కేసులు విచారణలో ఉన్నట్లు పేర్కొన్నారు. మరో 700 కేసుల్లో దర్యాప్తే ఇంకా పూర్తికాలేదని నివేదిక వెల్లడించింది. వీటిలో 360 కేసులు మూడేళ్లకు పైగా దర్యాప్తు దశలోనే ఉండటం ఆందోళన కలిగించే అంశంగా పేర్కొంది. ప్రజాప్రతినిధులపై నమోదైన కేసుల విచారణను వేగవంతం చేయాల్సిన అవసరాన్ని ఈ గణాంకాలు మరోసారి తెరపైకి తెచ్చాయి. ఇదిలావుంటే, అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ నివేదిక ప్రకారం లోక్‌సభలోని 543 మంది సభ్యుల్లో 251 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు వెల్లడైంది. వీరిలో 170 మందిపై తీవ్రమైన క్రిమినల్ కేసులు నమోదై ఉన్నట్లు ఆ సంస్థ పేర్కొంది.




## ప్రక్షాళన దిశగా ఎన్‌టీఏ అడుగులు..

# 50 మంది సిబ్బందిపై వేటు

**నీట్, యూజీసీ-నెట్ వివాదాల నేపథ్యంలో కేంద్రం సంచలన నిర్ణయం**

**10 కీలక వృత్తిపరమైన పోస్టుల భర్తీకి ఏజెన్సీ ప్రకటన జారీ**

**యూజీసీ-నెట్ పునఃపరీక్ష తేదీలు ఖరారు.. అదనపు ఫీజు లేదని స్పష్టీకరణ**

**న్యూఢిల్లీ:** నీట్ యూజీ పేపర్ లీకేజీ, యూజీసీ-నెట్ పరీక్షల్లో దొర్లిన తీవ్ర లోపాలు మరియు పరీక్షల రద్దు ఘటనలపై కేంద్ర విద్యాశాఖ కఠిన చర్యలకు ఉపక్రమించింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)లో సమగ్ర ప్రక్షాళనకు శ్రీకారం చుడుతూ, విధుల్లో నిర్లక్ష్యం వహించారన్న ఆరోపణలతో ఏకంగా 50 మందికి పైగా సిబ్బందిని తొలగించినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. పరీక్షల నిర్వహణలో విశ్వసనీయతను తిరిగి నిర్మించే లక్ష్యంతో ఈ భారీ ప్రక్షాళన చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి దీప్తి గౌర్ ముఖర్జీ, ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్, ఇతర సీనియర్ అధికారులతో అత్యున్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఏజెన్సీ పునర్నిర్మాణం కోసం తీసుకుంటున్న చర్యలను అధికారులు మంత్రికి వివరించారు. తొలగించిన సిబ్బంది స్థానంలో 10 కొత్త వృత్తిపరమైన పోస్టులను భర్తీ చేసేందుకు ఎన్‌టీఏ ప్రకటన జారీ చేసింది. చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్, చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్, టెస్ట్ సెక్యూరిటీ జనరల్ మేనేజర్, రీసెర్చ్ అండ్ సైకోమెట్రిక్స్ మేనేజర్ వంటి కీలక పోస్టులకు నియామకాలు చేపట్టనున్నారు. సైబర్ సెక్యూరిటీ, ప్రశ్నపత్రాల రూపకల్పన వంటి ప్రత్యేక విభాగాల కోసం ప్రైవేట్ రంగం నుంచి నిపుణులను తీసుకోనున్నారు. పరీక్షల కాన్ఫిడెన్షియల్ ఆపరేషన్స్ (జూచీరూూ) నిర్మాణాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాలని, పరీక్షా ప్రక్రియలపై సమగ్ర ఆడిట్ నిర్వహించి దిద్దుబాటు చర్యల నివేదిక ఇవ్వాలని అధికారులను కేంద్రమంత్రి ఆదేశించారు. మరోవైపు, కమిటీ సిఫారసుల మేరకు రద్దయిన యూజీసీ-నెట్ పరీక్షల పునఃనిర్వహణకు ఎన్‌టీఏ తేదీలను ప్రకటించింది. ఇంగ్లిష్, కామర్స్ పరీక్షలను సెప్టెంబర్ 9న, సోషియాలజీ పరీక్షను సెప్టెంబర్ 10న నిర్వహించనున్నారు. ఈ రీ-ఎగ్జామ్స్ రాసే అభ్యర్థులు అదనపు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని ఎన్‌టీఏ స్పష్టం చేసింది.

## ఈ నెల 18న జిల్లా ఇన్చార్జి మంత్రి రాక

### అదనపు పి.ఎస్. టు మినిస్టర్ కాసుల నానిల్ కుమార్



**:ఆసిఫాబాద్ టౌన్:** ఈ నెల 18వ తేదీన రాష్ట్ర ఆబ్కారీ మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక పురావస్తు శాఖ మంత్రి, ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లాకు పురానున్నారని అదనపు పి.ఎస్. టు మినిస్టర్ కాసుల నానిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీ ఉదయం 9.30 గంటల నుండి 11.30 గంటల వరకు జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలోని రన్ గ్రాండ్ బంక్వేట్ హాల్ లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ అవగాహన కార్యక్రమానికి హాజరవుతారని, మధ్యాహ్నం 12 గంటలకు వాంకిడి మండల కేంద్రంలో వాంకిడి నుండి కాగజ్ నగర్ వరకు 8 కోట్ల 50 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన హెచ్.ఎల్.బి. రోడ్ పనులకు శంకుస్థాపన చేస్తారని, మధ్యాహ్నం 12.45 గంటలకు జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఇందిరమ్మ మైనారిటీ మహిళ శక్తి పథకంలో భాగంగా లబ్ధిదారులకు కుట్టు మిషన్లు, ఇందిరమ్మ ఇండ్ల 2వ విడతలో లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తారని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.

## ఉత్తమ అవార్డు అందుకున్న ప్రిన్సిపల్కు సన్మానం



**:నేరడిగొండ:** విద్యారంగంలో విశేష సేవలు అందిస్తూ, కళాశాల అభివృద్ధికి కృషి చేస్తున్న నేరడిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ షబాన తరన్నుమ్కు జిల్లా స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా చేతుల మీదుగా ఆమె 'ఉత్తమ ప్రిన్సిపాల్' అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం నేరడిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపక బృందం, విద్యార్థులు ప్రిన్సిపల్ ను శాలువతో ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంతో పాటు కళాశాల అభివృద్ధికి ఆమె చేస్తున్న కృషిని అధ్యాపకులు కొనియాడారు. ఉత్తమ ప్రిన్సిపల్గా అవార్డు అందుకోవడం కళాశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ విద్యార్థుల అభ్యున్నతికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎంపీడీఓకు ఘన సన్మానం



**:నేరడిగొండ:** మండల నూతన ఎంపీడీఓగా సోమవారం బాధ్యతలు స్వీకరించిన గంగా సాగర్ రెడ్డిని జిల్లా లైవ్ అధ్యక్షుడు మహేందర్ జాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహేందర్ జాదవ్ మాట్లాడుతూ మండలంలోని ఆదివాసీ, గిరిజన ప్రజలు అక్షరాస్యతలో కొంత వెనుకబడి ఉన్నారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వారికి అవగాహన కల్పించి అర్హత గల ప్రతి కుటుంబానికి పథకాలు అందేలా కృషి చేయాలని కోరారు. అలాగే మండలంలో ప్రస్తుతం ప్రబలుతున్న సీజనల్ వ్యాధుల నివారణ, గ్రామ పంచాయతీల అభివృద్ధి పనులు, ఆసరా పెన్షన్ల దరఖాస్తులపై ఎంపీడీఓతో చర్చించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆసరా పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఎంపీడీఓగా గంగాసాగర్ రెడ్డి బాధ్యతల స్వీకరణ



**:నేరడిగొండ:** నేరడిగొండ మండల అభివృద్ధి అధికారిగా గంగాసాగర్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ఆయనను సాధారణంగా ఆహ్వానించి,శాలువా, పూల బోకేతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ మండల అభివృద్ధే తన ప్రథమ ప్రాధాన్యమని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరికీ చేర వేయడంలో అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది సహకారంతో ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ జీవన్ రెడ్డి, సూపరింటెండెంట్ శ్యామ్ సుందర్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ మంసూర్ బేగ్, టైపిస్ట్ శశికాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ కె.హరిత



**:ఆసిఫాబాద్ :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా కేంద్రం లోని జనకాపూర్ కు చెందిన సొన్నాయిల మానస తనకు దివ్యాంగుల పింఛను ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాగజ్ నగర్ మండలం అంకుషాపూర్ కు చెందిన సోగాల కోమల్ తనకు జనకాపూర్ శివారులో గల పట్టా భూమిని కొలతలు నిర్వహించి హద్దులు నిర్ధారించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ మండలం పర్సానంబాల గ్రామానికి చెందిన దుర్గం హనుమంతు తాను సాగు చేస్తున్న భూమికి పట్టాదారు పాసుపుస్తకం జారీ చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాగజ్ నగర్ పట్టణానికి చెందిన కాంపెల్లి రవీందర్ తన కుమారుడికి గురుకుల పాఠశాలలో సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఎస్. భాస్కర్ రావు తనకు దహేగాం మండలం లగ్గాం గ్రామ శివారులో గల భూములకు పట్టా పాస్ పుస్తకాలు జారీ చేయాలని కోరుతూ ఆర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ మండలం రహపల్లి గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ పి. శ్రీనివాస్ తాను సర్పంచ్ గా పనిచేసిన కాలం పెండింగ్ బిల్లులను ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్ నగర్ మండలం చింతగూడ కోయవాగు గ్రామానికి చెందిన సయ్యద్ జుబేర్ తనకు దివ్యంగా పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో మాట్లాడుతూ ప్రతి మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం నేటి నుండి నిర్వహించడం జరుగుతుందని, అర్జీదరులు తమ సమస్యలపై మండల స్థాయిలో దరఖాస్తు చేసినట్లయితే అక్కడే పరిష్కరించడం జరుగుతుందని, అక్కడ పరిష్కారం కానట్లయితే జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు సమర్పించవచ్చని తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

## గురుకులంలో అక్రమ అడ్మిషన్లపై విచారణ జరపాలి

### కేవిపిఎస్ డిమాండ్



**:ఆసిఫాబాద్ టౌన్:** ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల/కళాశాలలో చోటుచేసుకున్న అక్రమ అడ్మిషన్లపై సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పాఠశాలలో ప్రవేశ పరీక్ష రాయకుండానే కొంతమంది ఉపాధ్యాయులు వివిధ గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రుల నుండి వేలాది రూపాయలు వసూలు చేసి అక్రమంగా ప్రవేశాలు కల్పిస్తున్నారని ఆయన ఆరోపించారు. అంతేకాకుండా, విద్యార్థులు చేసే చిన్నచిన్న పొరపాట్లను సాకుగా చూపి ప్రిన్సిపాల్ విచక్షణారహితంగా టీసీలు ఇస్తూ వారిని బయటకు పంపుతున్నారని విమర్శించారు. అలా ఖాళీ చేసిన స్థానాల్లో మళ్ళీ డబ్బులు తీసుకుని కొత్త విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తున్నారని మండిపడ్డారు. ఈ అక్రమ అడ్మిషన్ల ప్రక్రియపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడిన ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులకు టీసీలు ఇచ్చి వేధింపులకు గురిచేసిన ప్రిన్సిపాల్పై కూడా సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## టీఆర్ఎస్ అధినేత్రి కవితను కలిసిన రాథోడ్ బాపురావు

- బోథ్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతంపై చర్చ



**:ఆదిలాబాద్:** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవితను ఆ పార్టీ రాష్ట్ర అబ్జర్వర్, బోథ్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు సోమవారం హైదరాబాద్లోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, పార్టీ బలోపేతానికి చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత పటిష్టం చేసేందుకు కార్యకర్తలు, నాయకులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నట్లు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్థాయి నుంచి పార్టీకి మరింత బలమైన ప్రజా మద్దతును తీసుకురావడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమించాల్సిన అవసరం ఉందని ఈ భేటీలో చర్చించినట్లు పేర్కొన్నారు. పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని కల్వకుంట్ల కవితకు రాథోడ్ బాపురావు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ భవిష్యత్ కార్యాచరణ, ప్రజలకు మరింత చేరువయ్యేలా అనుసరించాల్సిన వ్యూహాలపై కూడా చర్చ జరిగినట్లు వివరించారు.

## అట్టహాసంగా ప్రారంభమైన ప్రజావాణి

### 27 దరఖాస్తుల స్వీకరణ



**:బెజ్జూర్:** ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం బెజ్జూర్ మండల కేంద్రంలో అట్టహాసంగా ప్రారంభమైంది. సోమవారం జరిగిన ఈ ప్రజావాణి ప్రజా ఫిర్యాదుల విభాగంలో మొత్తం 27 దరఖాస్తులు అందినట్లు మండల ప్రజావాణి నోడల్ ఆఫీసర్, మండల అభివృద్ధి అధికారి బండారు ప్రవీణ్ కుమార్ తెలిపారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేస్తూ సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీ రాజ్ శాఖకు అత్యధికంగా 10 దరఖాస్తులు అందాయన్నారు. గ్రామాల్లో డ్రైనేజీ, వీధిదీపాలు, తాగునీటి సమస్యలు, సీసీ రోడ్లు వంటి అంశాలపై ఫిర్యాదులు ఉన్నాయని పేర్కొన్నారు. అటవీ శాఖ 3, రెవెన్యూ శాఖ 3 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. భూ సమస్యలు, పట్టాలు, అటవీ హక్కులకు సంబంధించిన సమస్యలతో కూడిన వినతులు అందినట్లు తెలిపారు. విద్యుత్ శాఖ 2, రోడ్డు భవనాల శాఖకు 2, పోలీస్ శాఖ 2 దరఖాస్తులు వచ్చాయన్నారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటు, రోడ్ల మరమ్మతులు, శాంతిభద్రతలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ 1, పశు సంవర్ధన శాఖ 1, ఆరోగ్య శాఖ 1, మహిళా శిశు సంక్షేమ శాఖ 1, గృహ నిర్మాణ శాఖ 1 చొప్పున దరఖాస్తులు అందాయి. పంట రుణాలు, పశువులకు సంబంధించిన సహాయం, ఆరోగ్య సేవలు, ఇందిరమ్మ ఇళ్లు వంటి అంశాలపై ప్రజలు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. ప్రజావాణి ద్వారా అధికారులు నేరుగా ప్రజలకు అందుబాటులోకి రావడంతో గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ అసమర్థతతో పథకాలపై హైకోర్టు స్టే





**:బెజ్జూర్:** కల్యాణలక్ష్మి–షాదీ ముబారక్ పథకాల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రెటరీ ఆర్ఎస్ ప్రవీణ్కుమార్, సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదేశాలతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేసిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాల కొనసాగింపుపై నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. హైకోర్టులో ప్రభుత్వం సకాలంలో కౌంటర్ దాఖలు చేయకుండా పథకాన్ని రద్దు చేసే దిశగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న ఈ పథకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేయకూడదని డిమాండ్ చేశారు. రాజకీయ కక్షలకు సంక్షేమ పథకాలను బలిచేయకుండా అర్హులైన ప్రతి కుటుంబానికి కల్యాణలక్ష్మి–షాదీ ముబారక్ ప్రయోజనం అందించాలని కోరారు. పథకాలను యథావిధిగా కొనసాగించి అర్హులైన లబ్ధిదారులకు వెంటనే ఆర్థిక సహాయం అందించాలన్నారు. ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- ఆదిలాబాద్ ఎంపీ గొడం నగేష్

:ఆసిఫాబాద్: ప్రభుత్వం ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యులు గొడం నగేష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి జిల్లా కలెక్టర్ కె.హరిత, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి, సొసైటీ సభ్యులు, వివిధ విభాగాల వైద్యులతో కలిసి హాజరై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ఆసుపత్రి అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధనపట్ల సమయపాలన పాటించాలని, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని, ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం కలిగించాలని తెలిపారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాల వైద్యులు, సిబ్బంది పూర్తిస్థాయిలో ఉండేలా నిబంధనల ప్రకారం నియామకాలు చేపట్టాలని తెలిపారు. ఆసుపత్రి నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, బ్లడ్ బ్యాంక్ స్థాయిని మరింత మెరుగుపరచాలని, రోగులకు అత్యవసర రక్త నిల్వలు అందుబాటులో ఉంచాలని, అంబులెన్స్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ఎక్స్ రే, స్కానింగ్, ఇతర పరికరాలు నిత్యం పనిచేసేలా పర్యవేక్షించాలని, ఆసుపత్రి ఆవరణలో జనరిక్ మందుల షాపు ఏర్పాటు చేయాలని, ఆసుపత్రి అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన పరికరాలు, సదుపాయాలు, సౌకర్యాల కల్పనకు





చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆసుపత్రిలో వైద్యుల ఖాళీలు, ల్యాబ్ టెక్నీషియన్, నర్సింగ్ అధికారులు వంటి ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకాష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నాగేంద్ర, వైద్య కళాశాల ప్రిన్సిపల్ వెంకన్న, ఆసుపత్రి పర్యవేక్షకులు, వివిధ విభాగాల వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# 70 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రభుత్వ కళాశాలను కాపాడాలి

:సత్తుపల్లి: సుమారు 70 ఏళ్ల చరిత్ర కలిగిన సత్తుపల్లి బండి శోభనాచలం ప్రభుత్వ కళాశాలను పరిరక్షించి పూర్వ వైభవం తీసుకురావాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కళాశాలను సందర్శించిన అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఒకప్పుడు సత్తుపల్లితో పాటు వేంసూరు, అశ్వారావుపేట, పెనుబల్లి, దమ్మపేట, కల్లూరు, తిరువూరు, మిషన్పేట, చింతలపూడి తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది విద్యార్థులు ఈ కళాశాలలో చదువుకునేవారని తెలిపారు. ఇక్కడ విద్యను అభ్యసించిన పలువురు ఐఏఎస్, ఐపీఎస్, తహశీల్దార్, వివిధ ఉన్నత స్థానాలకు ఎదిగారని పేర్కొన్నారు. ప్రస్తుతం కళాశాల భవనాలు శిథిలావస్థకు చేరుకోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. రేకులు కూలిపోయే పరిస్థితిలో ఉండటం, తలుపులు, కిటికీలు చెదలుపట్టి పాడవడం, ఇనుప సామాగ్రి తుప్పుపట్టడం, గదుల్లో చెత్త పేరుకుపోవడం వంటి సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఐటీఐ, వొకేషనల్ కోర్సులకు సంబంధించిన విలువైన యంత్ర పరికరాలు సైతం నిరుపయోగంగా మారుతోందన్నారు. కళాశాల



అభివృద్ధికి మెరుగైన భవనాలు, ఫర్నిచర్, బెంచీలు, కుర్చీలు, విద్యుత్, ఫ్యాన్లు, కిటికీలు, ఆధునిక ల్యాబ్లు, అవసరమైన పరికరాలు, పరిశుభ్రమైన వాతావరణం, క్రీడా మైదానం, పార్కింగ్ వంటి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. గత 24 ఏళ్లుగా సింగరేణి నిధులతో సత్తుపల్లి అభివృద్ధి చేస్తున్నామని చెబుతున్న ప్రజాప్రతినిధులు చారిత్రక కళాశాల అభివృద్ధికి సింగరేణి నిధులు ఎందుకు వినియోగించడం లేదని ప్రశ్నించారు. ఖమ్మం జిల్లా ప్రజాప్రతినిధులు, మంత్రులు, కాంగ్రెస్ నాయకులు కళాశాలను సందర్శించి సమస్యలను పరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ని వీరంరాజు, బానోత్ విజయ్, ప్రధాన కార్యదర్శి మంద శివ, డాక్టర్ పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు మట్టా దయానంద్ పరామర్శ

:సత్తుపల్లి: ఖమ్మం జిల్లా వేంసూరు మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన దశదినకర్మ కార్యక్రమాలకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ హాజరై బాధిత కుటుంబాలను పరామర్శించారు. సోమవారం గూడూరు గ్రామంలో పెద్దలు రావుల వెంకటేశ్వరరావు సతీమణి రావుల సీతమ్మ దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. చిత్రపటా [illegible] సి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా జయలక్ష్మీపురం గ్రామంలో కాంగ్రెస్ నాయకులు బొంతు గిరి తండ్రి బొంతు వెంకటేశ్వరరావు దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమాల్లో వేంసూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, జయలక్ష్మీపురం సర్పంచ్ గడిపర్తి శ్రీను, ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మండల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# ముస్తఫానగర్లో అభివృద్ధి పనులకు శ్రీకారం

:గంభీరావుపేట: మండలంలోని ముస్తఫానగర్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ బండ సుకన్య శంకుస్థాపన చేసి పనులను సోమవారం ప్రారంభించారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ దశల వారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామంలోని ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించేందుకు సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని, మిగిలిన అవసరమైన ప్రాంతాల్లోనూ అభివృద్ధి



పనులు చేపడతామని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శివంది దేవేందర్, వార్డు సభ్యులు చెరిపెల్లి సరస్వతి, వీరబోయిన రమేష్, దోమకొండ కృష్ణకాంత్ యాదవ్, చేరుపల్లి సాగర్, మారబోయిన లావణ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి కుమార్, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు బండ దేవయ్య, బండ రవికుమార్, కొక్కు రాజయ్య, కూడెల్లి ప్రవీణ్కుమార్, బండ రమేష్, కుడుకల తిరుపతి, నర్సింలు, కిషన్, ఎల్లం, సురేందర్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# నాలుగేళ్లు గడిచినా పూర్తికాని లింగన్నపేట బ్రిడ్జి

- కాంట్రాక్టర్పై చర్యలు తీసుకోవాలి
- తెలంగాణ జేఏసీ కన్వీనర్ అబ్దుల్ మజహర్

:గంభీరావుపేట: గంభీరావుపేట–లింగన్నపేట మధ్య నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పనులు ప్రారంభించి నాలుగేళ్లు గడిచినా పూర్తి కాకపోవడంపై తెలంగాణ జేఏసీ రాజన్న సిరిసిల్ల జిల్లా కన్వీనర్ అబ్దుల్ మజహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రిడ్జి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్రిడ్జి నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక మట్టి రహదారిని ఇటీవల తొలగించడంతో బస్సులు, ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయని తెలిపారు.



మట్టి రహదారిని తొలగిస్తున్న సమయంలో సంబంధిత అధికారులు కాంట్రాక్టర్ను ప్రశ్నించకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. నాలుగేళ్లుగా పనులు కొనసాగుతున్నప్పటికీ బ్రిడ్జి పూర్తి కాకపోవడంతో నాలుగు జిల్లాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.



మట్టి రహదారిని తక్షణమే పునరుద్ధరించి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ మూడు, నాలుగు రోజుల్లో రహదారిని పునరుద్ధరించకపోతే ప్రజల సహకారంతో స్వచ్ఛందంగా మట్టి పోసి రహదారిని సరిచేస్తామని హెచ్చరించారు. కాంట్రాక్టర్, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు అవసరమైతే హైకోర్టులో పిల్ దాఖలు చేస్తామని అన్నారు. సెప్టెంబర్ 1న ఢిల్లీ పర్యటన అనంతరం లింగన్నపేట బ్రిడ్జి వద్ద గ్రామస్తులతో కలిసి భారీ ధర్నా చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని వివరించారు. బ్రిడ్జి నిర్మాణంలో జాప్యం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వానికి వ్యతిరేకంగానే ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, గ్రామస్తులను కలుపుకుని ఉద్యమాన్ని చేపడతామని తెలిపారు. బ్రిడ్జి పూర్తయ్యే వరకు ప్రజల తరఫున పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు.

# కల్యాణలక్ష్మి–షాదీ ముబారక్పై బీఆర్ఎస్ నిరసన



:కాగజ్నగర్: కల్యాణలక్ష్మి–షాదీ ముబారక్ పథకంపై కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు కాగజ్నగర్ పట్టణంలో సోమవారం నిరసన చేపట్టారు. బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రెటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. గత ప్రభుత్వం పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేసిందని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగించడంలో నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయకుండా పథకాన్ని రద్దు చేసే దిశగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరమైన ఈ పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేయకూడదని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పాత రికార్డులు అందక కుల ధ్రువీకరణకు అవస్థలు

## ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్న యువతి




:నేరడిగొండ: ఎస్టీ లంబాడ కుల ధ్రువీకరణ పత్రం కోసం పాత రికార్డులు అందుబాటులో లేక నేరడిగొండ మండలం బొందిడి గ్రామానికి చెందిన సిహెచ్.మమత తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు ఆమె సోమవారం మండల ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. గత నెల రోజులుగా తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నప్పటికీ, నూతన మార్గదర్శకాల ప్రకారం 1954 నుంచి 1970 మధ్య కాలానికి చెందిన పహాణీలు, ఓటరు జాబితాలు సమర్పించాల్సి ఉండటంతో ప్రక్రియ నిలిచిపోయిందని తెలిపారు. తమ కుటుంబానికి అప్పట్లో భూములు లేకపోవడం, చదువుకోకపోవడంతో పాత పత్రాలు లభించడం లేదన్నారు. కేవలం 1977 నాటి ఓటరు జాబితా మాత్రమే తమ వద్ద ఉందని పేర్కొన్నారు. 1952 నుంచి 1974 వరకు గల ఓటరు జాబితా, పాత ఎన్నికల రికార్డులను పరిశీలించి, మానవతా దృక్పథంతో నిబంధనలు సడలించి కుల ధ్రువీకరణ పత్రం జారీ చేయాలని అధికారులను విజ్ఞప్తి చేశారు.

# అర్జీలను వెంటనే పరిష్కరించాలి

## జిల్లా అదనపు కలెక్టర్లు రాజేశ్వర్ ఆర్ఎస్ చిత్రు



:ఆదిలాబాద్: ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలను పెండింగ్లో ఉంచకుండా అత్యంత ప్రాధాన్యతతో నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, ఆర్ఎస్.చిత్రు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును సునిశితంగా పరిశీలించి శాఖల వారీగా సమీక్షించి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. బాధ్యతాయుతంగా వ్యవహరించి సమస్యలకు వేగవంతమైన పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, పింఛన్లు, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం పనులు, భూమికి సంబంధించిన సమస్యలపైనే అధికంగా వినతులు నమోదయ్యాయని వివరించారు. అందిన అర్జీలను వెంటనే సంబంధిత శాఖలకు పంపించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ స్రవంతి, డీఆర్డీఏ రవీందర్ రాథోడ్, ఏఓ వర్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్ ప్రవేశాల గడువు పెంపు

:**నేరడిగొండ:** జిల్లాలో ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాల గడువును పొడిగిస్తూ జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయం ప్రకటన విడుదల చేసిందని సెర్ప్ ఇంచార్జి ఏపిఎం లింగారాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 16 నుంచి 31 వరకు అడ్మిషన్లు పొందేందుకు అవకాశం కల్పించబడిందని తెలిపారు. పదవ తరగతి అడ్మిషన్ కోసం ఓసి పురుషులకు రూ.1400, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ పురుషులకు, మాజీ సైనికోద్యోగుల పిల్లలు, మహిళలకు రూ.వెయ్యిగా నిర్ణయించినట్లు చెప్పారు. పదవ తరగతి రిజిస్ట్రేషన్ ఫీజు అందరికీ రూ.150 ఉండగా, ఆఫ్ లైన్ ఛార్జీలు అదనంగా ఉంటాయని పేర్కొన్నారు. అలాగే ఇంటర్మీడియట్ అడ్మిషన్ల కోసం ఓసి పురుషులకు రూ.1500, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పురుషులకు, మాజీ సైనికోద్యోగుల పిల్లలు, మహిళలకు రూ.1200 ఫీజు ఉంటుందని తెలిపారు. ఇంటర్ రిజిస్ట్రేషన్ ఫీజు అందరికీ రూ. 300 ఉండగా, ఆఫ్ లైన్ ఛార్జీలు అదనంగా ఉంటారని, అపరాధ రుసుము పదవ తరగతికి రూ.100, ఇంటర్మీడియట్కు రూ.200 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్లో ప్రవేశం కోసం అభ్యర్థులు తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం వెబ్ సైట్ www.Telanganaopen-school.org ద్వారా ఆన్లైన్ ఫారం పూర్తి చేసి, అడ్మిషన్ ఫీజు చెల్లించి రశీదు పొందాలని సూచించారు. అనంతరం సంబంధిత అధ్యయన కేంద్రాల్లో అడ్మిషన్ ఫారంతో పాటు ధృవపత్రాలను సమర్పించాలని వివరించారు.

# భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి వేడుకలు



:**నేరడిగొండ(ఇచ్చోడ):** మండలంలోని సాత్ నంబర్ గ్రామంలో నాగుల పంచమి పండుగను పురస్కరించుకుని గ్రామ ప్రజలు సోమవారం భక్తిశ్రద్ధలతో వేడుకలను జరుపుకున్నారు. గ్రామ సర్పంచ్ రాథోడ్ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రకృతి ఆరాధనకు, సర్పారాధనకు ప్రతీక అయిన నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని మహిళలు పుట్టలో పాలు పోసి, ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ హిందూ సంస్కృతిలో నాగుల పంచమికి ప్రత్యేక స్థానం ఉందని, ప్రకృతిలో జీవరాశులను, ముఖ్యంగా పాములను రక్షించాలనే సందేశాన్ని ఈ పండుగ మనకు చాటుతుందని తెలిపారు. గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని నాగదేవతను ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# సిరికొండ నుంచి ఉమ్రా యాత్రకు రసూల్ కుటుంబం



:**సిరికొండ:** మండల కేంద్రానికి చెందిన రసూల్ తన కుటుంబ సభ్యులతో కలిసి పవిత్ర ఉమ్రా యాత్రకు పయనమవుతున్న సందర్భంగా సిరికొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంచం లక్ష్మణ్, రాజమణి వారిని ఘనంగా సన్మానించారు. సోమవారం రసూల్ నివాసానికి వెళ్లిన మండల అధ్యక్షుడు పార్టీ నాయకులతో కలిసి శాలువా కప్పి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కంచం లక్ష్మణ్ మాట్లాడుతూ రసూల్ కుటుంబ సభ్యుల ఉమ్రా యాత్ర సుఖసంతోషాలతో, ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షించారు. పవిత్ర యాత్రను ముగించుకుని వారు క్షేమంగా తిరిగి రావాలని దేవుడిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాయికుమార్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర



:**సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా తల్లాడ మండల పరిధిలోని తెలగరం గ్రామానికి చెందిన లకావత్ సాయికుమార్ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పరామర్శించారు. సాయికుమార్ నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వీరమోహన్ రెడ్డి, దొడ్డ శ్రీను, కేతినేని చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# లక్షల్లో వ్యాపారాలు.. కార్లు ఉన్నా 'తెల్ల' కార్డులే..!

- కెరమెరి మండలంలో యథేచ్ఛగా బోగస్ రేషన్ కార్డుల దందా
- ప్రభుత్వ ఖజానాకు గండి.. అర్హులైన పేదలకు అన్యాయం




:**కెరమెరి:** పేదరిక నిర్మూలన, నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బియ్యం, ఆరోగ్యశ్రీ తదితర సంక్షేమ పథకాలు కెరమెరి మండలంలో అనర్హుల పాలవుతున్నాయన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. లక్షల రూపాయల టర్నోవర్ చేసే వ్యాపారాలు నిర్వహిస్తున్నవారు, సొంత కార్లు, బొలేరో, ఐచర్ వంటి వాణిజ్య వాహనాలు కలిగి ఉన్నవారు సైతం తెల్ల రేషన్ కార్డులు కలిగి ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## నిబంధనలు కాగితాలకే పరిమితం..?

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్థికంగా స్థిరపడిన కుటుంబాలు, నిర్దేశిత ప్రమాణాలకు మించి ఆదాయం కలిగినవారు, అర్హత ప్రమాణాలకు సరిపోని వారు తెల్ల రేషన్ కార్డులకు అనర్హులు. జీఎస్టీ రిజిస్ట్రేషన్ కలిగిన వ్యాపారాలు, ఆదాయపు పన్ను చెల్లింపుదారులు, నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య వాహనాలు కలిగిన కుటుంబాల అర్హతను అధికారులు పరిశీలించాల్సి ఉంటుంది. అయితే కెరమెరి మండలంలో ఈ నిబంధనలు క్షేత్రస్థాయిలో ఎంతవరకు అమలవుతున్నాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

## సంపన్నులకు సంక్షేమ పథకాలా..?

లక్షల్లో వ్యాపారాలు చేస్తూ, కార్లు, వాణిజ్య వాహనాలు కలిగి ఉన్న కొందరు వ్యక్తులు సైతం తెల్ల రేషన్ కార్డులు కొనసాగించుకుంటూ ఉచిత రేషన్ బియ్యం, ఇతర సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అర్హత లేని కుటుంబాలకు ప్రభుత్వ ప్రయోజనాలు అందితే అసలైన నిరుపేదలకు అన్యాయం జరుగుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంపన్న కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డులు ఎలా కొనసాగుతున్నాయనే దానిపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. తహశీల్దార్, రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి అర్హత లేని కార్డులను గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆధార్, ఆదాయపు పన్ను, జీఎస్టీ, వాహనాల రిజిస్ట్రేషన్ తదితర వివరాలను సమగ్రంగా పరిశీలిస్తే అనర్హుల రేషన్ కార్డుల వ్యవహారం వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. అనర్హులకు ఉచిత రేషన్ బియ్యం, ఇతర సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందడంతో ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడటంతో పాటు నిజమైన పేదలకు అందాల్సిన ప్రయోజనాలు దూరమయ్యే ప్రమాదం ఉంది. మండలంలో తెల్ల రేషన్ కార్డులపై ప్రత్యేక సర్వే నిర్వహించి అనర్హులను తొలగించి, అర్హులైన పేదలకు మాత్రమే సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలి



:**తాండూర్:** కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం యథావిధిగా కొనసాగించాలని తాండూర్ మండల బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలోని ఐబీ సర్వీస్ రోడ్డుపై పార్టీ శ్రేణులు రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే అమల్లో ఉన్న సంక్షేమ పథకాలను సక్రమంగా కొనసాగించలేకపోతోందని విమర్శించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిలిపివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు ఈ పథకాలు ఎంతో అండగా నిలిచాయని తెలిపారు. తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, ఉన్న సంక్షేమ పథకాలను కూడా నిలిపివేయాలని చూడటం దుర్మార్గమన్నారు. పథకాలను నిలిపివేస్తే పేద కుటుంబాలకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో సంక్షేమ పథకాలు నిరంతరం కొనసాగాయని, ప్రస్తుత ప్రభుత్వం వాటిని నిలిపివేస్తోందని ఆరోపించారు. ధర్నా అనంతరం బీఆర్ఎస్ నాయకులు మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుబ్బ దత్తుమూర్తి, నాయకులు పూసాల ప్రణయ్కుమార్, గట్టు సంతోష్కుమార్, ఎలుక రామచందర్, మాసాడి శ్రీరాములు, బోడ సతీష్, జాడి పోశం, అద్వాల సత్యనారాయణ, బాబుఖాన్, ఇక్బాల్, చింటూ, దుగ్యాల ప్రదీప్రావు, క్రాంతికుమార్, శ్రీనివాస్, చోదన్, గద్దం మణికుమార్, వేల్పుల శంకర్, దుర్గం లక్ష్మీనారాయణ, కోల జ్యోతి, ఎరుకల రాజమణి, గుండేటి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలోకి సర్పంచ్లతో పాటు పలువురి చేరిక



:**గుడిహత్నూర్:** మండలంలోని వైజాపూర్ గ్రామ సర్పంచ్ మడావి సీతాబాయి, రాగాపూర్ సర్పంచ్ సిడాం లక్ష్మణ్ తమ అనుచరులు, గ్రామస్తులతో కలిసి సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని జీఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ పీఏసీ సమావేశంలో ఈ చేరికలు జరిగాయి. జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి ఆడే గజేందర్ తదితరులు కొత్తగా పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్లో చేరుతున్నారని తెలిపారు. పార్టీలో చేరిన వారు కాంగ్రెస్ సిద్ధాంతాలను, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గుడిహత్నూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దౌలత్రావు, డీసీసీ జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ మల్యాల కరుణాకర్, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తహశీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ శ్రేణుల ధర్నా



:**కౌటాల:** పేదింటి ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలిచే కళ్యాణలక్ష్మి–షాదీ ముబారక్ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆదే వసంతరావు మాట్లాడుతూ ప్రభుత్వ అసమర్థత వల్లే హైకోర్టు ఈ పథకాలపై స్టే విధించిందని ఆరోపించారు. బడుగు, బలహీన వర్గాలు, పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించిన ఈ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పథకాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగించాలని డిమాండ్ చేశారు. పథకాల నిలుపుదలతో అర్హులైన లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అనంతరం సర్పంచ్ నక్క శంకర్ మాట్లాడుతూ పథకాలను వెంటనే పునరుద్ధరించకపోతే భవిష్యత్తులో మరింత భారీ ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మనీష్, వీందర్ గౌడ్, బందు పటేల్, ప్రభాకర్ గౌడ్, లాంచ్ పటేల్, తుమ్మిడి తుకారాం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు తక్షణమే స్పందించాలి



:**తాండూర్:** మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించాలని మండల ప్రత్యేక అధికారి కె.అంజయ్య సూచించారు. సోమవారం తాండూర్ ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి సింగిల్ విండో చైర్మన్ సుబ్బ దత్తుమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో మాదారం సర్పంచ్ కృష్ణపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ సబ్ హెల్త్ సెంటర్లో పూర్తిస్థాయిలో సిబ్బంది లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిపై పీహెచ్సీ వైద్యురాలు డాక్టర్ ఝాన్సీ స్పందిస్తూ సిబ్బంది కొరత ఉన్నట్లు అంగీకరించారు. కొత్త సిబ్బంది వచ్చే వరకు అందుబాటులో ఉన్న సిబ్బందితో సేవలు కొనసాగిస్తామని తెలిపారు. కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రేపల్లెవాడ, పెగడపల్లి గ్రామాల ప్రజలు రేషన్ బియ్యం కోసం కొత్తపల్లికి వెళ్లేందుకు ఆటో ఖర్చులు భరించాల్సి వస్తోందని సర్పంచ్ ఆకుల వెంకటేష్ సభ దృష్టికి తీసుకువచ్చారు. రేపల్లెవాడలో రేషన్ షాపు ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం ఉన్న షాపును కొన్ని రోజుల పాటు అక్కడ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై తహశీల్దార్ యు.జ్యోత్స్న మాట్లాడుతూ కొత్త రేషన్ షాపుల ఏర్పాటుకు సబ్కలెక్టర్, జిల్లా కలెక్టర్ అనుమతులు అవసరమని తెలిపారు. కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ కొనసాగుతోందని, కార్డులు లేని అర్హులు మీ–సేవ ద్వారా దరఖాస్తు చేసుకుని రశీదును కార్యాలయంలో సమర్పిస్తే సర్వే అనంతరం కార్డు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ పి.శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నీటి లభ్యతను బట్టి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**:మంచిర్యాల:** నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. సోమవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నీటిపారుదల శాఖ ఎస్ఈ విష్ణుప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం, భూగర్భ జలమట్టాలు తగ్గుతున్న నేపథ్యంలో రైతులు పంటల వైవిధ్యీకరణపై దృష్టి సారించాలన్నారు. ప్రస్తుత ఖరీఫ్తో పాటు రానున్న రబీ సీజన్లోనూ నీటి లభ్యతలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని సూచించారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని ప్రథమ ప్రాధాన్యతగా తాగునీటి అవసరాలకు వినియోగించాల్సిన పరిస్థితి ఉందన్నారు. గొల్లవాగు తదితర ప్రాజెక్టుల్లో వరి సాగుకు అవసరమైన స్థాయిలో నీరు అందుబాటులో ఉండే అవకాశం లేదని తెలిపారు. ఒక ఎకరా వరికి అవసరమయ్యే నీటితో మూడు నుంచి నాలుగు ఎకరాల్లో తక్కువ నీటితో సాగు చేసే పంటలను పండించవచ్చని వివరించారు. నీటి కొరతతో వరి పంటకు పూర్తిస్థాయిలో నీరు అందక ఎండిపోయే ప్రమాదం ఉందని, దీంతో దిగుబడి, ధాన్యం నాణ్యత తగ్గే అవకాశం ఉందన్నారు. గింజ పరిమాణం తగ్గడంతో పాటు మార్కెట్లో విక్రయించడంలోనూ రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని తెలిపారు. మొక్కజొన్న, కంది, పెసలు, మినుములు, అలసందులు




వంటి తక్కువ నీటితో సాగు చేయగల పంటలను రైతులు ఎంచుకోవాలని సూచించారు. పప్పుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు అవసరమైన విత్తనాలను అందించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మొక్కజొన్న, కంది, పెసలు, మినుములు తదితర పంటలకు ప్రభుత్వం కనీస మద్దతు ధర కల్పిస్తోందని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తూ అధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేయాలంటే వరికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవడం ప్రయోజనకరమని తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నాగుల పంచమి



**:తాండూర్:** నాగుల పంచమి పర్వదినాన్ని మండల ప్రజలు సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాండూర్ పోచమ్మ గుడి, తాండూర్ సర్కిల్ కార్యాలయం సమీపంలోని పాముల పుట్టల వద్ద, తంగళ్ళపల్లి గ్రామంలోని శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి దేవాలయం ఆవరణలో గల పాముల పుట్ట వద్ద మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి పాముల పుట్టలో పాలు పోశారు.

# ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**:మంచిర్యాల:** ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మందమర్రి మండలం క్యాతన్పల్లి గాంధీనగర్కు చెందిన లింగంపల్లి లక్ష్మి తాను దినసరి కూలీగా జీవిస్తున్నానని, రెండు పడక గదుల ఇల్లు మంజూరు చేయాలని కోరారు. హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన మొగిలి మల్లయ్య తన వారసత్వ భూమిని అన్నదమ్ములు ఆక్రమించుకుని బెదిరిస్తున్నారని, న్యాయం చేయాలని అర్జీ



సమర్పించారు. బెల్లంపల్లి మండలం మాల గురుజాల సర్పంచ్ పెద్దబోయిన శ్యామలత గ్రామ రైతుల పంటల సాగుకు మత్తడి మరమ్మతులు చేపట్టేందుకు తక్షణ సహాయం అందించాలని కోరారు. లక్షెట్టిపేట మండలం తిమ్మాపూర్కు చెందిన గవ్వల రాజమణి, పెరుగు తిరుపతి తమ పట్టా భూములకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలని వేర్వేరుగా దరఖాస్తులు అందజేశారు. మంచిర్యాల ఆండాళమ్మ కాలనీకి చెందిన ఓరుగంటి నరసమ్మ తన ఇంటి పక్కనే ఉన్న డంపింగ్ యార్డు కారణంగా దోమలు, ఈగల బెడదతో ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని, దానిని తొలగించాలని కోరారు. నస్పూర్ శ్రీరాంపూర్ కాలనీకి చెందిన భాగ్యలక్ష్మి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల స్థాయిలో ఎంపీడీఓ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు

- **నాగదేవతకు మున్సిపల్ ఛైర్పర్సన్ బండారి అనుషా సతీష్ ప్రత్యేక పూజలు**



**:ఆదిలాబాద్:** నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మున్సిపల్ ఛైర్పర్సన్ బండారి అనుషా సతీష్ నాగదేవతకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్ట వద్ద పాలు పోసి, ప్రత్యేక హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలందరికీ నాగుల చవితి పర్వదిన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. మన సాంప్రదాయాలు, ఆచారాలు, విశ్వాసాలను ప్రతిఒక్కరూ గౌరవిస్తూ, తమ విశ్వాసాలకు అనుగుణంగా దైవభక్తితో జీవించాలని కోరారు. అదే సమయంలో అన్ని మతాల ప్రజలు పరస్పరం గౌరవించుకుంటూ, మతసామరస్యాన్ని పాటిస్తూ ఐకమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమృద్ధిగా వర్షాలు కురిసి, రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని నాగదేవతను వేడుకున్నట్లు తెలిపారు. నాగదేవత ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

- **జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్**

**:సిరిసిల్ల:** ప్రజావాణిలో ప్రజలు సమర్పించే అర్జీలకు అధికారులు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు బాధ్యతగా వ్యవహరించి ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఐడీఓసీలో నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 136 దరఖాస్తులు అందగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు. సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో రెండు దరఖాస్తులు, వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో ఏడు దరఖాస్తులు వచ్చాయి. వాటిని సంబంధిత అధికారులకు అందజేసి





సత్వరమే పరిష్కరించాలని సూచించారు. అలాగే ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి నిర్వహించారు. మండలాల్లో మొత్తం 107 దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంతో పాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓ కార్యాలయాలు, అన్ని ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జెడ్పీ సీఈఓ వెంకట మాధవరావు, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

# తాండూర్ ప్రజావాణిలో 23 దరఖాస్తులు




**:తాండూర్:** తాండూర్ ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నోడల్ అధికారి, ఎంపీడీఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 23 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వివరాలను పోర్టల్లో నమోదు చేశారు. శాఖల వారీగా ఎంపీడీఓకు 2, తహశీల్దార్ కు 6, ఎంపీఓకు 11, ఆర్ అండ్ బీకి 1, ఇరిగేషన్ కు 1, విద్యుత్ శాఖకు 1, ఆదర్శ 1 దరఖాస్తులు వచ్చాయని, మొత్తం 19 శాఖల అధికారులు హాజరైనట్లు ఎంపీడీఓ తెలిపారు.

# ఎయిడ్స్ నియంత్రణపై విస్తృత ప్రచారం చేయాలి

- **అవగాహన ర్యాలీని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్**

**:సిరిసిల్ల:** ఎయిడ్స్ నియంత్రణపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ నుంచి నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ నియంత్రణకు సంబంధించిన టోల్ఫ్రీ నంబర్ 1097, క్యూఆర్ కోడ్తో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ ర్యాలీ ఐడీఓసీ నుంచి ప్రారంభమై కొత్త బస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా, గాంధీచౌక్ మీదుగా మానేరు వంతెన వరకు సాగింది. అనంతరం తిరిగి ఐడీఓసీకి చేరుకుని ముగిసింది. ఎయిడ్స్ నియంత్రణపై






ఈనెల 12 నుంచి ప్రారంభమైన అవగాహన కార్యక్రమాలు 18వ తేదీ వరకు కొనసాగనున్నాయని తెలిపారు. ప్రజలకు వ్యాధి నియంత్రణ, నివారణ చర్యలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎయిడ్స్ నిర్ధారణ పరీక్షలు, వైద్యం, మందులు, కౌన్సెలింగ్ వంటి సేవలపై ప్రజలకు వివరించాలని ఆదేశించారు. పాజిటివ్ కేసులు నమోదైన ప్రాంతాల్లో పకడ్బందీగా నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. యువత, విద్యార్థులకు ఎయిడ్స్పై అవగాహన కల్పించేందుకు సమావేశాలు, వివిధ పోటీలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వెంకట మాధవరావు, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా విద్యాధికారి మొండయ్య, వైద్యులు, వైద్య సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నేటి నుంచి అంగన్వాడీ సర్టిఫికెట్ల పరిశీలన

**:సిరిసిల్ల:** జిల్లాలో అంగన్వాడీ టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం నుంచి సర్టిఫికెట్ల పరిశీలన చేపడుతున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి పి.లక్ష్మిరాజం తెలిపారు. వేములవాడ ప్రాజెక్టు పరిధిలో 12 అంగన్వాడీ టీచర్ పోస్టులకు 350 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈనెల 18, 19 తేదీల్లో సీడీపీఓ కార్యాలయంలో వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 18న మర్తనపేట, నిజాంబాద్, కోనరావుపేట, తడగొండ, కొత్తపేట, వరదవెల్లి, మానాల, చందుర్తి కేంద్రాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు, 19న దేవుని తండా, కెన్యా నాయక్ తండా, రుద్రవరం, తిప్పాపురం కేంద్రాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాజరుకావాలని సూచించారు. సిరిసిల్ల ప్రాజెక్టు పరిధిలో 43 పోస్టులకు 1,125 దరఖాస్తులు వచ్చాయని, 18 నుంచి 21వ తేది వరకు ఆర్డీఓ కార్యాలయ సముదాయానికి ఎదురుగా ఉన్న కమ్యూనిటీ హాల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుందని తెలిపారు. 18న ఇల్లంతకుంట, వీర్నపల్లి, 19న ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, 20న గంభీరావుపేట, తంగళ్లపల్లి, 21న సిరిసిల్ల పట్టణ పరిధిలోని కేంద్రాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాజరుకావాలని పేర్కొన్నారు. పరిశీలన ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని, అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ ప్రతులను తీసుకురావాలని సూచించారు. అంగన్వాడీ టీచర్ల ఎంపిక పూర్తిగా అర్హత, మెరిట్ ఆధారంగానే జరుగుతుందని, ప్రక్రియలో ఎలాంటి పైరవీలకు తావు లేదని స్పష్టం చేశారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే దళారులను నమ్మవద్దని, అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# మండల స్థాయి ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

**:సొనాల:** ప్రజలు మండల స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు, డీసీసీ ఎస్సీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి భీంరావు పాటిల్, డీసీసీ కార్యదర్శి లోలపు పోశెట్టి కోరారు. సోమవారం సొనాల మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారని తెలిపారు. భూ సమస్యలు, పెన్షన్లు, రేషన్ కార్డులు, విద్యుత్, తాగునీరు, మురుగు కాలువలు తదితర సమస్యలపై ప్రజలు మండల స్థాయిలోనే అర్జీలు సమర్పించి పరిష్కారం పొందవచ్చని పేర్కొన్నారు. ప్రజల నుంచి అందిన దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కోరారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# ముఖంపై ముడతలా? ఈ చిట్కాలతో తగ్గించుకోండి

మన శరీర చర్మం వయస్సుతో మారుతుంది, ముఖ చర్మం మినహాయింపు కాదు. బిడ్డ పుట్టగానే ఒకలా ఉంటే, ఎదిగే కొద్దీ వయసు పెరిగే కొద్దీ మరోలా మారిపోతుంది. అలాగే, వృద్ధాప్యంతో, ముఖం యొక్క గ్లో వాడిపోతుంది, ముడతలు పోతాయి. కాబట్టి ముఖ చర్మాన్ని యవ్వనంగా ఉంచే ముఖానికి మొదటి నుంచీ జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. వృద్ధాప్యంతో పాటు చర్మాన్ని వేధించే సమస్య ముడతలు. ఈ ముడతలు కూడా మన వయస్సుకి సంకేతం. ముఖంపై ఉండే ఈ ముడతలు మనలో వృద్ధాప్య భావనను పెంచి, ఆందోళన , ఒత్తిడిని కలిగిస్తాయి. వయసు పెరిగే కొద్దీ అదంతా సహజమే కానీ ముఖంలో ముడతలు మన అందాన్ని తగ్గిస్తాయి.



### ముఖంపై ముడతలను తగ్గించే చిట్కాలు

సన్ స్క్రీన్: ఎస్ పీఎఫ్40తో కూడిన సన్‌స్క్రీన్‌ని ఉపయోగించడం ద్వారా మీ చర్మాన్ని సూర్యకిరణాల నుండి రక్షించుకోవడం అనేది మీ ముఖ ముడతలను సమర్థవంతంగా నిరోధించడానికి ఉత్తమమైన చిట్కా. సన్‌స్క్రీన్ మీ చర్మాన్ని UV కిరణాల నుండి రక్షిస్తుంది, అకాల వృద్ధాప్యం , ముడతలను నివారిస్తుంది.




### మాయిశ్చరైజర్

కొబ్బరి నూనె లేదా అలోవెరా జెల్ వంటి సహజమైన మాయిశ్చరైజర్‌తో మీ చర్మాన్ని ఎల్లప్పుడూ హైడ్రేట్ చేయండి. ఇది ముఖంలో తేమను లాక్ చేయడానికి , ఫైన్ లైన్లను తగ్గించడానికి సహాయపడుతుంది. హైడ్రేటెడ్ చర్మం ముడతలు పడే అవకాశం తక్కువ. గ్లిజరిన్ లేదా సహజ పదార్థాలు అధికంగా ఉండే మాయిశ్చరైజర్లను ఉపయోగించండి.



### సమతుల్య ఆహారం తీసుకోండి :

ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి, ఆరోగ్యకరమైన చర్మాన్ని ప్రోత్సహించే పండ్లు, ఆకు కూరలు , గింజలు వంటి యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండే సమతుల్య ఆహారం తీసుకోండి.



### ఫేస్ మసాజ్

తరచుగా ఫేస్ మసాజ్ చేయడం వల్ల రక్త ప్రసరణ పెరుగుతుంది , ముఖ కండరాలు రిలాక్స్ అవుతాయి. ముడతలు , ఉబ్బినట్లు తగ్గిస్తుంది. అలాగే చర్మాన్ని లోతుగా పోషించి ముడతలను నివారిస్తుంది.



### ఫేస్ ప్యాక్

పసుపు , కొబ్బరి నూనె పేస్ట్ లేదా తేనె , అవకాడో ఫేస్ మాస్క్ వంటి సహజ నివారణలలో ముఖానికి వర్తించండి. ఇది ముడుతలను తగ్గించడానికి , కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. మీ ముఖాన్ని శుభ్రపరచడానికి పచ్చి పాలను రాయండి. ఎందుకంటే ఇందులో లాక్టిక్ యాసిడ్ పుష్కలంగా ఉంటుంది , ఇది మీ ముఖాన్ని మృదువుగా ఉంచుతుంది



### విటమిన్ సి

విటమిన్ సి పుష్కలంగా ఉన్న చర్మం కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచడంలో సహాయపడుతుంది, చర్మ స్థితిస్థాపకతను మెరుగుపరుస్తుంది , చక్కటి గీతలు , ముడతలను తగ్గిస్తుంది. విటమిన్ సి స్క్రబ్‌ని ఉపయోగించడం వల్ల డెడ్ స్కిన్ తొలగిపోయి మీ ఛాయ మెరుస్తుంది. యాంటీఆక్సిడెంట్ గుణాలు చర్మాన్ని పర్యావరణ నష్టం నుండి రక్షిస్తాయి , వృద్ధాప్య సంకేతాలను తగ్గిస్తాయి.




### ఎక్కువ నీరు, తగినంత నిద్ర

చాలా నీరు త్రాగడానికి ప్రాధాన్యత ఇవ్వండి, హైడ్రేషన్ మీ చర్మాన్ని హైడ్రేట్ చేస్తుంది. ప్రతి రాత్రి 78 గంటల నిద్రను పొందండి, మీ చర్మం పునరుత్పత్తి , నీటితో పాటు దానికదే రిపేర్ చేయడంలో సహాయపడుతుంది.



# పెరుగుతో వీటిని కలిపి తినకండి..

పెరుగు ఇష్టముండని వాళ్లు చాలా తక్కువ మందే ఉంటారు. భోజనం చివర్లో పెరుగుతో నాలుగు ముద్దలు తిననదే ఆ భోజనం సంపూర్ణం అనిపించదు. పెరుగులో ఉండే ఔషధ గుణాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. జీర్ణ వ్యవస్థ మెరుగవడంతో పాటు శరీరంలో ఎన్నో జీవ క్రియలకు పెరుగు ఎంతో మేలు చేస్తుంది.
అయితే కొన్ని పదార్థాలు పెరుగులో కలుపుకొని తినడం కరెక్ట్ కాదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అవేంటో ఈ కథనంలో తెలుసుకుందాం.. పెరుగత కూరలు కలుపుకుని తినడం ఆరోగ్యానికి ఏ మాత్రం మంచిదికాదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇలా ఇతర కూరల్లో పెరుగు కలుపుకొని తినడం వల్ల.. పెరుగులో ఉండే ఔషద గుణాలు పోయి.. అనారోగ్య సమస్యలు వస్తాయని చెబుతున్నారు. అయితే పెరుగుతో కలిపి తినకూడని ఆ ఫుడ్స్ ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం..

### పెరుగుతో ఏప కూరలు కలిపి తినొద్దంటే..

పెరుగులో ఎప్పుడూ కూడా వెల్లుల్లి కలిపి తినొద్దని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే వెల్లుల్లిలో వేడి చేసే గుణం ఉంటుంది. దీనిని పెరుగుతో కలిపి తీసుకోవడం వల్ల.. అజీర్తి, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు వస్తాయి.





### ఉల్లిపాయ కలపొచ్చా?

సాధారణంగా పెరుగులో ఉల్లిపాయ వేసుకొని సలాడ్ మాదిరిగా చేసుకొని తింటూ ఉంటారు. ప్రతీ ఫంక్షన్‌లో ఇది జరుగుతూ ఉంటుంది. అయితే ఇలా పెరుగులో ఉల్లిపాయలను కలిపి తినడం మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు. ఇలా తినటం వల్ల పేగు నొప్పి వస్తుందని, జీర్ణ సంబంధిత సమస్యలూ పెరిగే అవకాశముందని అంటున్నారు.

## మీ భాగస్వామిలో ఈ లక్షణాలు గమనించారా?

# అయితే జర భద్రం

**దంపతుల మధ్య గొడవలు జరగడం వెరీ కామన్. చిన్న చిన్న గొడవలే పెద్ద ఘర్షణలకు దారి తీస్తూ ఉంటాయి. భాగస్వామి కావాలనే మానసికంగా, శారీరకంగా వేధిస్తూ ఉంటారు. అయితే ఇలాంటి బంధం ప్రమాదకరంగా మారుతుందని అర్థం చేసుకోవాలని నిపుణులు అంటున్నారు. మీ భాగస్వామిలో కనిపించే కొన్ని లక్షణాలు, వారి ప్రవర్తన ఆధారంగా బంధం ప్రమాదకరంగా మారుతుందంటూ గ్రహించొచ్చని నిపుణులు చెబుతున్నారు. అవేంటో ఇప్పుడు చూద్దాం..**



- ఇలాంటి సందర్భంగాల్లో మీ భాగస్వామి మిమ్మల్ని తప్పుదోడ పట్టించేందుకు ప్రయత్నిస్తారు. మనపై మనకు నమ్మకం లేకుండా చేసేందుకు అవసరమైన కార్యాచరణ చేస్తుంటారు. అన్ని రకాలుగా మనల్ని ఆధీనంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తూ ఉంటారు. దీనిని గ్యాస్‌లైటింగ్ అంటారని మానసిక నిపుణులు పేర్కొంటున్నారు. ఇలాంటి సందర్భాల్లో జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు.
- ప్రతి విషయంలో మీ భాగస్వామి మీతొ అబద్ధాలు చెప్పేందుకు ప్రయత్నిస్తూ ఉంటారు. తప్పును కప్పిపుచ్చేందుకు ఇంకో తప్పు చేస్తూ ఉంటారని, అలాంటి వారి పట్ల జాగ్రతగా ఉండాలని సూచిస్తున్నారు.
- చిన్న చిన్న విషయాలకే కొప్పడడం, ఒకరిపై చిరాకు పడడం, అనవసరంగా అరడవం వంటివి చేస్తే, ఆ బంధం ప్రమాదకరంగా మారుతున్నట్లు అర్థం చేసుకోవాలని చెబుతున్నారు.
- కొత్త ఏడాదిలో ఈ రొమాంటిక్ రిజల్యూషన్స్ మీ లైఫ్ ను మార్చేయొచ్చు..."కొత్త ఏడాదిలో ఈ రొమాంటిక్ రిజల్యూషన్స్ మీ లైఫ్ ను మార్చేయొచ్చు..."
- ఇలాంటి వారిలో గతంలో కంటే ఎక్కువగా మార్పులు కనిపిస్తాయని, తమ భాగస్వామిని శారీరకంగా, మానసికంగానే కాకుండా వారి భావోద్వేగాలపై కూడా దెబ్బకొట్టాలని ప్రయత్నిస్తుంటారట. ఇలాంటి సమయాల్లో భాగాస్వామి మాటలను చేతలను బట్టి వారి ప్రవర్తనను అర్థం చేసుకోవాలని అంటున్నారు.
- ఇలాంటి వ్యక్తులు.. తమ భాగస్వామిపై అసూయ, ద్వేషం పెంచుకుంటారని తెలిపారు. ఇలాంటి వ్యక్తులకు మీరు చెప్పే మాటలు రుచించవట. తాము చెప్పేది నిజమని నమ్మిస్తూ.. ఎదుటివారి మనోభావాలాపై దెబ్బకొట్టాలని, వారిలోని ఆత్మవిశ్వాసాన్ని నాశనం చేయాలని చూస్తుంటారట.
- నిజమైన బంధంలో సర్దుకుపోవడం, అర్థం చేసుకోవడం వంటివి ఉంటాయి. కానీ మిమ్మల్ని విధించాలని అనుకునే వారిలో ఇలాంటి లక్షణాలు కనిపించవని, ఈ విషయంలోనూ వారు రాజీ పడరని చెబుతున్నారు. అలాంటి వ్యక్తులు తమ మాటనే చెల్లుబాటు అయ్యేవిధంగా ప్రవర్తిస్తుంటారని, అలాంటి లక్షణాలు కనిపిస్తే జాగ్రత్తగా ఉండాలన్నారు.
- అనుమానం అనేది పెనుభూతమని మన పెద్దలు చెబుతూ ఉంటారు. అయితే, మిమ్మల్నీ వేదించే భాగస్వామిలో అనుమానం అనేది తీవ్ర స్థాయిలో ఉంటుందని చెబుతున్నారు. ప్రతీ విషయంలో మిమ్మల్ని అనుమానిస్తూ ఉంటారని, మీ ఫోన్ సంభాషణ దొంగచాటుగా వినే ప్రయత్నం చేస్తూ ఉంటారని హెచ్చరిస్తున్నారు. అందుకే ఇలాంటి లక్షణాలు మీ భాగస్వామిలో కనిపిస్తే వెంటనే పసిగట్టి, తనపై తగిన జాగ్రత్తలు, చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.



# వైద్య చరిత్రలో అరుదైన విస్మయం

డాక్టర్ లక్ష్మీనాథ్ నేతృత్వంలో సంక్లిష్ట మెదడు శస్త్రచికిత్స విజయవంతం

## సోమాలియా శిశువుకు 'కేర్'లో పునర్జన్మ

ప్రాణదాత డాక్టర్ లక్ష్మీనాథ్ శివరాజు అపూర్వ శస్త్రచికిత్సా వైభవం

ప్రాణాలపై ఆశలు సన్నగిల్లిన తొమ్మిది నెలల పసికందు.. మెదడులో అరుదైన కణితి.. దానికి తోడు మెదడులో ద్రవం విపరీతంగా పేరుకుపోయిన అత్యంత క్లిష్ట పరిస్థితి. ఒకటి కాదు.. ఒకేసారి రెండు సంక్లిష్ట సమస్యలు. ఏమాత్రం తేడా జరిగినా ప్రాణానికే ప్రమాదం. అలాంటి పరిస్థితిలో హైదరాబాద్‌లోని కేర్ ఆసుపత్రి వైద్యులు సాహసోపేతమైన శస్త్రచికిత్స నిర్వహించి సోమాలియాకు చెందిన చిన్నారి షఫీ మహమ్మద్ హుస్సేన్‌కు కొత్త జీవితం ప్రసాదించారు. సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ లక్ష్మీనాథ్ శివరాజు నేతృత్వంలోని వైద్య బృందం ఒకే విడతలో రెండు కీలక ప్రక్రియలను విజయవంతంగా పూర్తిచేసింది. తొమ్మిది నెలల షఫీ మహమ్మద్ హుస్సేన్ కొంతకాలంగా మందకొడిగా మారడం, పిలిచినా సరిగా స్పందించకపోవడం, ఆకలి తగ్గడం వంటి లక్షణాలతో బాధపడుతున్నాడు. స్థానికంగా చికిత్స చేసినా పరిస్థితిలో మార్పు రాకపోవడంతో తల్లిదండ్రులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. హైటెక్‌సిటీలోని కేర్ ఆసుపత్రిలో చిన్నారిని పరీక్షించిన వైద్యులు అత్యాధునిక పరీక్షలు నిర్వహించారు.


### మెదడుపై పెరిగిన ఒత్తిడి

ఎంఆర్ఐ పరీక్షల్లో చిన్నారి మెదడులో సెరెబ్రోస్పైనల్ ద్రవం అధికంగా పేరుకుపోయినట్లు వైద్యులు గుర్తించారు. దీనివల్ల తీవ్రమైన హైడ్రోసెఫాలస్ ఏర్పడి మెదడుపై ఒత్తిడి పెరిగింది. శిశువుల్లో పుర్రె ఎముకలు పూర్తిగా కలవకపోవడంతో ద్రవం పెరిగేకొద్దీ తల పరిమాణం అసాధారణంగా పెరిగే అవకాశం ఉంటుంది. పరిస్థితి మరింత విషమిస్తే చూపు, నాడీ వ్యవస్థ దెబ్బతినడంతో పాటు మూర్ఛలు, శాశ్వత వైకల్యం వంటి తీవ్రమైన సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుందని వైద్యులు గుర్తించారు. హైడ్రోసెఫాలస్‌కు కారణాన్ని గుర్తించే ప్రయత్నంలో మెదడులో అరుదైన గ్లియోన్యూరల్ కణితి ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. మెదడులోని సున్నితమైన ప్రాంతంలో ఏర్పడిన ఈ కణితి ద్రవ ప్రసరణకు ఆటంకం కలిగిస్తూ పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చినట్లు గుర్తించారు. తొమ్మిది నెలల శిశువుకు మెదడు శస్త్రచికిత్స చేయడం అత్యంత సవాలుతో కూడుకున్నది. చిన్నారి శరీర బరువు, పరిమిత రక్త పరిమాణం, మత్తుమందు నిర్వహణతో పాటు మెదడులోని అతి సున్నితమైన నరాలను కాపాడుకుంటూ శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుంది. దీంతో డాక్టర్ లక్ష్మీనాథ్ శివరాజు నేతృత్వంలోని బృందం అన్ని అంశాలను పరిశీలించి ఒకే విడతలో రెండు కీలక ప్రక్రియలు నిర్వహించాలని నిర్ణయించింది.

### ఒకే ఆపరేషన్‌లో రెండు ప్రక్రియలు

తొలుత వెంట్రిక్యులో-పెరిటోనియల్ షంట్ ప్రక్రియ ద్వారా మెదడులో అధికంగా పేరుకున్న ద్రవాన్ని ప్రత్యేక నాళం ద్వారా పొత్తికడుపులోకి మళ్లించారు. తద్వారా మెదడుపై ఒత్తిడిని తగ్గించారు. అనంతరం అదే ఆపరేషన్‌లో క్రానియోటమీ నిర్వహించి సూక్ష్మ శస్త్రచికిత్స పద్ధతుల్లో కణితిని తొలగించారు. న్యూరోసర్జరీతో పాటు మత్తుమందు, చిన్నపిల్లల వైద్యం, రేడియాలజీ, అత్యవసర వైద్య విభాగాల బృందాలు సమన్వయంతో పనిచేయడంతో సంక్లిష్టమైన శస్త్రచికిత్స విజయవంతమైంది. శస్త్రచికిత్స అనంతరం చిన్నారి వేగంగా కోలుకున్నట్లు వైద్యులు తెలిపారు. మూడు రోజుల్లోనే స్పృహతో స్పందిస్తూ, పాలు తీసుకుంటూ సాధారణ స్థితికి చేరడంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. వేల కిలోమీటర్ల దూరంలోని సోమాలియా నుంచి ప్రాణాలపై ఆశతో హైదరాబాద్‌కు వచ్చిన కుటుంబానికి ఈ వైద్య విజయం కొత్త ఆనందాన్ని అందించింది. అత్యంత చిన్న వయసులో ఉన్న శిశువుకు సంక్లిష్టమైన మెదడు సమస్యలను ఒకే విడతలో పరిష్కరించడం ద్వారా డాక్టర్ లక్ష్మీనాథ్ శివరాజు నేతృత్వంలోని వైద్య బృందం తన నైపుణ్యాన్ని చాటింది. సరిహద్దులు దాటి వచ్చిన పసిప్రాణాన్ని కాపాడిన ఈ శస్త్రచికిత్స హైదరాబాద్ వైద్యరంగ సామర్థ్యానికి మరో నిదర్శనంగా నిలిచింది.






# ప్రేమకు ఓ రోజు.. అనుబంధానికి ఓ వేడుక



- స్నేహం.. ప్రేమ.. సహజీవనానికి ప్రతీకగా జంటల దినోత్సవం
- బంధాన్ని బలోపేతం చేసుకునేందుకు ప్రత్యేక సందర్భం
- ఒకరికొకరు సమయం కేటాయించడమే అసలైన కానుక
- ఆప్యాయత, విశ్వాసం, గౌరవమే అనుబంధానికి పునాది
- నేడు జాతీయ జంటల దినోత్సవం



**ప్రేమ అనేది కేవలం మాటల్లో వ్యక్తమయ్యే భావన కాదు. ఒకరిని మరొకరు అర్థం చేసుకోవడం, కష్టసుఖాల్లో తోడుగా నిలవడం, పరస్పరం గౌరవించుకోవడం, జీవిత ప్రయాణాన్ని కలిసి సాగించడం. అలాంటి అనుబంధాన్ని మరోసారి గుర్తుచేసుకునే సందర్భమే జాతీయ జంటల దినోత్సవం. ఏటా ఆగస్టు 18న ఈ రోజును జరుపుకుంటారు. అధికారిక పండుగ కాకపోయినా ప్రేమ, అనుబంధం, పరస్పర సహకారానికి అంకితమైన రోజుగా ప్రాచుర్యం పొందింది.**

### బిజీ జీవితంలో బంధానికి కాస్త సమయం

ఉద్యోగాలు, వ్యాపారాలు, కుటుంబ బాధ్యతలు, సామాజిక మాధ్యమాల ప్రభావంతో ఆధునిక జీవితం ఉరుకులు పరుగులమయంగా మారింది. ఒకే ఇంట్లో ఉంటున్నా మనసు విప్పి మాట్లాడుకునేందుకు సమయం దొరకని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో జీవిత భాగస్వామికి కొంత సమయం కేటాయించడం ఎంత ముఖ్యమో జంటల దినోత్సవం గుర్తుచేస్తోంది. జీవిత భాగస్వాములు, ప్రేమికులు, నిశ్చితార్థం చేసుకున్నవారు ఇలా తమ అనుబంధాన్ని ప్రత్యేకంగా భావించే జంటలు ఈ రోజును తమదైన రీతిలో జరుపుకుంటున్నారు. ఖరీదైన బహుమతులకంటే కలిసి గడిపే కొద్దిసేపు, మనస్ఫూర్తిగా చెప్పే ప్రేమమాట, ఆప్యాయమైన ఆలింగనం ఎంతో విలువైనవిగా మారుతున్నాయి.

### వాణిజ్య ప్రచారం నుంచి ప్రేమ వేడుకగా..

జంటల దినోత్సవానికి సుదీర్ఘమైన చారిత్రక నేపథ్యం లేదు. ఇటీవలి దశాబ్దాల్లోనే దీనికి ప్రాచుర్యం పెరిగింది. తొలుత వాణిజ్య ప్రచారాల్లో భాగంగా ప్రాచుర్యంలోకి వచ్చిన ఈ సందర్భం.. సామాజిక మాధ్యమాల విస్తరణతో ప్రేమను, అనుబంధాన్ని గుర్తుచేసుకునే రోజుగా మారింది. ప్రస్తుతం వివిధ దేశాల్లో యువ జంటలు తమ జ్ఞాపకాలను, చిత్రాలను, ప్రేమ సందేశాలను పంచుకుంటూ ఈ రోజును ప్రత్యేకంగా మార్చుకుంటున్నారు.

### విశ్వాసమే బంధానికి బలం

ఏ బంధమైనా ప్రేమ ఒక్కటితోనే నిలబడదు. పరస్పర విశ్వాసం, గౌరవం, సహనం, అవగాహన కూడా అవసరం. చిన్న చిన్న అపార్థాలను మాట్లాడుకుని పరిష్కరించుకోవడం, ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించడం, కష్టాల్లో అండగా నిలవడం అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తాయి. ఒక పువ్వు ఇవ్వడం.. కలిసి భోజనం చేయడం.. పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకోవడం.. కలిసి సినిమా చూడడం.. మనసులోని భావాలను ఓ చిన్న లేఖలో రాయడం.. ఇలా సాధారణంగా కనిపించే చిన్న చర్యలే ఇద్దరి మధ్య అనుబంధాన్ని మరింత గాఢంగా మార్చగలవు.





### ప్రేమకు వయసుతో పనేముంది!

జంటల దినోత్సవం అంటే యువ ప్రేమికులకో, కొత్తగా పెళ్లయిన వారికో మాత్రమే పరిమితమైన రోజు కాదు. జీవితంలో ఎన్నో ఆటుపోట్లను కలిసి ఎదుర్కొని దశాబ్దాలుగా ప్రయాణిస్తున్న దంపతులకు కూడా అంతే ప్రత్యేకమైనది. కాలం గడిచేకొద్దీ ప్రేమ రూపం మారవచ్చు. కానీ ఒకరిపై మరొకరికి ఉండే నమ్మకం, తోడు, ఆప్యాయత మరింత బలపడుతుంటాయి. సంతోషకరమైన దాంపత్యం కుటుంబ వాతావరణంపైనా సానుకూల ప్రభావం చూపుతుంది. భార్యాభర్తల మధ్య పరస్పర గౌరవం, అవగాహన ఉన్న కుటుంబాల్లో పిల్లలకు కూడా ఆరోగ్యకరమైన భావోద్వేగ వాతావరణం లభిస్తుంది. అందుకే బలమైన అనుబంధాలు వ్యక్తులకే కాదు.. కుటుంబానికి, సమాజానికీ బలాన్నిస్తాయి.

### ఖరీదైన కానుక కాదు.. కాస్త సమయమే చాలు

జంటల దినోత్సవం చెప్పే సందేశం కూడా ఇదే. ప్రేమను నిరూపించడానికి ఖరీదైన బహుమతులు అవసరం లేదు. 'నేనున్నాను' అనే భరోసా.. 'నీకు విలువిస్తున్నాను' అనే భావన.. కష్టంలో పట్టుకునే చేయి.. ఆనందంలో పంచుకునే చిరునవ్వు-ఇవే నిజమైన కానుకలు.

**ఆగస్టు 18 ఒక తేదీ మాత్రమే కావచ్చు. కానీ ఆ రోజు గుర్తుచేసే విలువ మాత్రం జీవితాంతం అవసరమైనదే. ప్రేమలో ఆనందం.. అనుబంధంలో బలం.. పరస్పర గౌరవంలో నిలకడ ఉంటేనే ఇద్దరి ప్రయాణం అందమైన జ్ఞాపకంగా మారుతుంది. ఒకరినొకరు ప్రేమించుకోవడం ఎంత ముఖ్యమో.. ఆ ప్రేమను ప్రతిరోజూ వ్యక్తం చేయడం అంతకంటే ముఖ్యం.**

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# మూడు రోజుల తర్వాత జెండా పండుగ!

- దేశానికి ఆగస్టు 15.. వారికి ఆగస్టు 18న స్వాతంత్ర్య సంబరం
- విభజన గీతతో తూర్పు పాకిస్తాన్‌లోకి వెళ్లిన కొన్ని ప్రాంతాలు
- రాడ్‌క్లిఫ్ అవార్డు వెల్లడయ్యాక మారిన సరిహద్దుల చిత్రం
- భారత్‌లో భాగమయ్యామన్న ఆనందంతో ఎగిరిన త్రివర్ణ పతాకం
- నాడియా, మాల్డాల్లో ఇప్పటికీ కొనసాగుతున్న చారిత్రక జ్ఞాపకం





భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజు ఆగస్టు 15. దేశమంతా మువ్వన్నెల జెండా రెపరెపలాడిన వేళ.. పశ్చిమ బెంగాల్‌లోని కొన్ని ప్రాంతాల ప్రజలు మాత్రం తాము భారత్‌లో ఉన్నామా.. తూర్పు పాకిస్తాన్‌లో ఉన్నామా అన్న సందిగ్ధంలో గడపాల్సి వచ్చింది. విభజన సమయంలో సరిహద్దుల నిర్ధారణలో ఏర్పడిన గందరగోళమే ఇందుకు కారణం. చివరకు రాడ్‌క్లిఫ్ సరిహద్దు నిర్ణయం వెల్లడైన తర్వాత పరిస్థితి స్పష్టమై, నాడియా, మాల్డా జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలు భారత్‌లో భాగమయ్యాయి. ఆ చారిత్రక పరిణామాన్ని గుర్తుచేసుకుంటూ ఆయా ప్రాంతాల్లో ఆగస్టు 18కు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. 1947లో బ్రిటిష్ పాలన నుంచి భారత్ విముక్తి పొందుతున్న సమయంలోనే దేశ విభజన కూడా జరిగింది. భారత్, పాకిస్తాన్ మధ్య సరిహద్దులను నిర్ణయించే బాధ్యత సర్ సిరిల్ రాడ్‌క్లిఫ్ నేతృత్వంలోని కమిషన్‌కు అప్పగించారు. బెంగాల్ విభజనలో మతపరమైన జనాభాతో పాటు భౌగోళిక, పరిపాలనా అంశాలను పరిగణనలోకి తీసుకుని సరిహద్దులను నిర్ణయించారు. అయితే స్వాతంత్ర్యం వచ్చిన ఆగస్టు 15 నాటికి రాడ్‌క్లిఫ్ అవార్డు అధికారికంగా ప్రజలకు వెల్లడికాలేదు. దీంతో బెంగాల్‌లోని అనేక సరిహద్దు ప్రాంతాల్లో తీవ్ర అయోమయం నెలకొంది. నాడియా జిల్లాలోని కొన్ని ప్రాంతాలు తొలుత తూర్పు పాకిస్తాన్‌లో భాగమయ్యాయనే సమాచారం వ్యాపించడంతో స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. మాల్డా జిల్లాలోనూ ఇదే తరహా అనిశ్చిత పరిస్థితులు కనిపించాయి.

### 17న సరిహద్దుపై స్పష్టత

ఆగస్టు 17న రాడ్‌క్లిఫ్ అవార్డు అధికారికంగా వెల్లడికావడంతో బెంగాల్ సరిహద్దులపై స్పష్టత వచ్చింది. నాడియా జిల్లాలోని అధిక భాగం భారత్‌లోని పశ్చిమ బెంగాల్‌కు దక్కగా, కొన్ని ప్రాంతాలు తూర్పు పాకిస్తాన్‌లోకి వెళ్లాయి. మాల్డా జిల్లాలోనూ అధిక భాగం భారత్‌లో ఉండగా కొన్ని ప్రాంతాలు తూర్పు పాకిస్తాన్‌లో చేరాయి. ఈ పరిణామంతో అప్పటివరకు భవిష్యత్తుపై ఆందోళనతో ఉన్న భారత భూభాగంలోకి వచ్చిన ప్రాంతాల ప్రజల్లో ఆనందం వెల్లివిరిసింది. ఆగస్టు 18న త్రివర్ణ పతాకాలను ఎగురవేసి తమ ప్రాంతం భారత్‌లో భాగమైన ఆనందాన్ని జరుపుకున్నట్లు స్థానిక చరిత్రలో నమోదైంది.

### శిబ్నిబాస్‌లో ప్రత్యేక సంబరం

నాడియా జిల్లాలోని శిబ్నిబాస్ ప్రాంతంలో ఈ చారిత్రక జ్ఞాపకానికి ప్రత్యేక స్థానం ఉంది. అక్కడ ఆగస్టు 18న త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తూ నాటి పరిణామాలను గుర్తుచేసుకునే సంప్రదాయం కొనసాగుతోంది. స్వాతంత్ర్యం అంటే కేవలం పాలకులు మారడం కాదని.. తాము ఏ దేశంలో భాగంగా జీవించాలన్న ప్రజల ఆకాంక్షతోనూ ముడిపడి ఉందని నాటి సంఘటన గుర్తుచేస్తోంది.

### ఒక గీత.. వేలాది జీవితాలు

దేశ విభజన సమయంలో కాగితంపై గీసిన సరిహద్దు గీత లక్షలాది మంది జీవితాలను తలకిందులు చేసింది. కొన్ని గ్రామాలు ఒక దేశంలో.. పక్కనే ఉన్న గ్రామాలు మరో దేశంలోకి వెళ్లిపోయాయి. కుటుంబాలు, బంధుత్వాలు, జీవనోపాధులు సరిహద్దులకు ఇరువైపులా విడిపోయాయి. నాడియా, మాల్డా ప్రాంతాల అనుభవం కూడా ఆ విషాద చరిత్రలో భాగమే. అందుకే ఆగస్టు 18 అక్కడి కొన్ని ప్రాంతాలకు క్యాలెండర్‌లో మరో తేదీ మాత్రమే కాదు. సందిగ్ధం తొలగి.. తాము భారత్‌లో భాగమన్న స్పష్టత వచ్చిన చారిత్రక క్షణానికి గుర్తు. దేశమంతా ఆగస్టు 15న స్వాతంత్ర్య సంబరాలు చేసుకుంటే.. మూడు రోజుల తర్వాత మరోసారి మువ్వన్నెల జెండా ఎగరేసి నాటి చరిత్రను స్మరించుకోవడం ఆ ప్రాంతాల ప్రత్యేకత.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

## ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్..

# పీవీ సింధు శుభారంభం




- ఐర్లాండ్ షట్లర్‌పై వరుస గేమ్‌లలో ఘన విజయం
- కేవలం 28 నిమిషాల్లోనే ముగిసిన పోరు
- తదుపరి రౌండ్‌లోకి దూసుకెళ్లిన భారత స్టార్
- డబుల్స్‌లోనూ భారత జోడీల విజయపరంపర

**న్యూఢిల్లీ:** ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు అదిరిపోయే ఆరంభం చేసింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ఐర్లాండ్‌కు చెందిన సోఫియా నోబెల్‌ను వరుస గేమ్‌లలో చిత్తు చేసి తదుపరి రౌండ్‌లోకి దూసుకెళ్లింది. ఆరంభం నుంచే పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన సింధు కేవలం 28 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించింది. మహిళల సింగిల్స్ రౌండ్ ఆఫ్ 64లో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ సింధు.. 21 ఏళ్ల సోఫియా నోబెల్‌తో తొలిసారి తలపడింది. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా తొలి గేమ్‌లో వరుస పాయింట్లతో చెలరేగింది. పదునైన షాట్లు, వేగవంతమైన కదలికలతో నోబెల్‌పై ఒత్తిడి పెంచుతూ 21-7తో తొలి గేమ్‌ను సునాయాసంగా సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లోనూ సింధు అదే జోరు కొనసాగించింది. నాలుగు పాయింట్ల ఆధిక్యంతో గేమ్‌ను ప్రారంభించింది. మధ్యలో నోబెల్ పుంజుకుని వరుస పాయింట్లు సాధించడంతో కొద్దిసేపు పోరు ఆసక్తికరంగా మారింది. అయితే కీలక సమయంలో తన అనుభవాన్ని ప్రదర్శించిన సింధు వరుసగా ఏడు పాయింట్లు సాధించి ప్రత్యర్థి ఆశలకు గండి కొట్టింది. చివరకు 21-11తో రెండో గేమ్‌నూ కైవసం చేసుకుని 2-0తో మ్యాచ్‌ను ముగించింది.

### డబుల్స్‌లోనూ భారత్ జోరు

మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ జోడీ కూడా విజయంతో బోణీ చేసింది. స్పెయిన్‌కు చెందిన పౌలా-లూసియా జంటను 21-9, 21-13తో వరుస గేమ్‌లలో ఓడించి రౌండ్ ఆఫ్ 32కు చేరుకుంది. పురుషుల డబుల్స్‌లో ఎంఆర్ అర్జున్--హరిహరన్ జోడీ కూడా విజయం సాధించి తదుపరి రౌండ్‌కు అర్హత సాధించింది.

# ఆస్ట్రేలియాకు మరో షాక్

- 44వేల డాలర్ల ఫైన్‌తో పాటు పాయింట్ల కోత!
- బంగ్లాదేశ్‌తో తొలి టెస్టులో ఓటమి వెనుకే ఓవర్ రేట్ ఉచ్చు
- డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికపై పడనున్న తీవ్ర ప్రభావం



**డార్విన్:** బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు మ్యాచ్‌లో ఓటమితో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న ఆస్ట్రేలియాకు ఇప్పుడు ఓవర్ రేట్ ఉచ్చు వెంటాడుతోంది. రెండు టెస్టుల సిరీస్‌లో 0-1 తేడాతో వెనుకబడిన ఆసీస్‌పై ఐసీసీ చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. నిర్ణీత సమయంలో ఓవర్లు పూర్తి చేయకపోవడంతో ఆ జట్టుపై భారీ జరిమానాతో పాటు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ) పాయింట్ల కోత పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. డార్విన్ వేదికగా జరిగిన తొలి టెస్టులో ఆస్ట్రేలియా నాలుగో రోజు టీ విరామానికి ముందే ఓటమి పాలైంది. మూడో రోజు ఆ జట్టు 90 ఓవర్లు వేయాల్సి ఉండగా.. కేవలం 86 ఓవర్లే పూర్తి చేసింది. దీంతో ఐసీసీ నిబంధనల ప్రకారం ఆస్ట్రేలియా ఓవర్ రేట్ ఉల్లంఘనకు పాల్పడినట్లయింది. అయితే మ్యాచ్ రిఫరీ దీనిపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

### ఒక్కో ఓవర్‌కు 5 శాతం జరిమానా

ఐసీసీ నిబంధనల ప్రకారం సాధారణంగా ఒక రోజులో 90 ఓవర్లు వేయాల్సి ఉంటుంది. అయినప్పటికీ ఆస్ట్రేలియా నాలుగు ఓవర్లు తక్కువగా వేసింది. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే.. ఒక్కో ఓవర్ తక్కువగా వేసినందుకు ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో 5 శాతం చొప్పున జరిమానా విధించే అవకాశం ఉంటుంది. ఆస్ట్రేలియా ఆటగాళ్లకు ఒక్కో టెస్టుకు సుమారు 20 వేల డాలర్లు మ్యాచ్ ఫీజుగా లభిస్తుందని సమాచారం. నాలుగు ఓవర్ల లోటుకు ఒక్కో ఆటగాడిపై 4 వేల డాలర్ల జరిమానా పడొచ్చు. తుది జట్టులో ఉన్న 11 మంది ఆటగాళ్లపై కలిపి 44 వేల డాలర్ల జరిమానా పడే అవకాశం ఉంది. ఓవర్ రేట్ నిబంధన ఉల్లంఘనకు కేవలం జరిమానాతోనే సరిపెట్టకుండా.. పరిస్థితులను బట్టి ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్లను కూడా ఐసీసీ తగ్గించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆస్ట్రేలియా 84 పాయింట్లతో డబ్ల్యూటీసీ పట్టికలో అగ్రస్థానంలో ఉంది. ఒక్కో స్లో ఓవర్‌కు ఒక పాయింట్ కోత పడుతుంది. ఈ లెక్కన నాలుగు ఓవర్లకు నాలుగు పాయింట్ల వరకు కోత పడుతుందని ఐసీసీ వర్గాలు పేర్కొన్నాయి. అయితే ఇతర జట్ల తాజా పాయింట్ల శాతాన్ని బట్టి పట్టికలో ఆస్ట్రేలియా స్థానం మారే అవకాశం ఉంటుంది.

# గాలేలో భారత్ పట్టు.. గిల్ సూపర్ క్యాచ్!

- 99 పరుగులకే శ్రీలంక ఐదు వికెట్లు డౌన్
- తొలి ఓవర్‌లోనే సిరాజ్ దెబ్బ
- వరుస వికెట్లతో చెలరేగిన మానవ్ సుతార్
- కమిందు మెండిస్‌ను వెనక్కి పంపిన కుల్దీప్
- గాల్లోకి దూకి అద్భుత క్యాచ్ అందుకున్న గిల్




**గాలే:** శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో భారత్ పట్టు బిగించింది. తొలి ఇన్నింగ్స్‌లో 462 పరుగుల భారీ స్కోరు చేసిన భారత జట్టు.. అనంతరం బౌలింగ్‌లోనూ సత్తా చాటింది. మూడో రోజు భోజన విరామ సమయానికి శ్రీలంకను 99 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయేలా చేసింది. దీంతో ఆతిథ్య జట్టు ఇంకా 363 పరుగులు వెనుకబడి ఉంది. శ్రీలంక ఇన్నింగ్స్ ఆరంభంలోనే మహ్మద్ సిరాజ్ దెబ్బకొట్టాడు. తన తొలి ఓవర్‌లోనే నిషాన్ ఫెర్నాండోను పరుగులేమీ చేయకుండానే పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత మానవ్ సుతార్ వరుసగా రెండు కీలక వికెట్లు పడగొట్టాడు. దినేశ్ చండీమాల్, లహిరు ఉడారాలను ఔట్ చేసి శ్రీలంకను ఒత్తిడిలోకి నెట్టాడు. కుల్దీప్ యాదవ్ కూడా కీలక సమయంలో వికెట్ సాధించాడు.

### గాల్లోకి దూకిన గిల్..

కుల్దీప్ యాదవ్ బౌలింగ్‌లో కమిందు మెండిస్ ఇచ్చిన క్యాచ్‌ను శుభ్‌మన్ గిల్ అద్భుతంగా అందుకున్నాడు. బంతి తనకు ఎడమవైపు వెళ్తుండగా మెరుపువేగంతో స్పందించిన గిల్ గాల్లోకి డైవ్ చేసి ఒంటి చేత్తో క్యాచ్‌ను ఒడిసిపట్టాడు. ఈ క్యాచ్ మ్యాచ్‌కే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అంతకుముందు తొమ్మిది వికెట్లకు 460 పరుగులతో మూడో రోజు ఆట ప్రారంభించిన భారత్ మరో రెండు పరుగులు జోడించి 116.4 ఓవర్లలో 462 పరుగులకు ఆలౌటైంది. భారత తొలి ఇన్నింగ్స్‌లో దేవదత్ పడిక్కల్ 167 పరుగులతో భారీ ఇన్నింగ్స్ ఆడాడు. శ్రీలంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య 109 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు. వర్షం కారణంగా ఆదివారం రెండు సెషన్ల ఆట నిలిచిపోయినప్పటికీ మూడో రోజు భారత బౌలర్లు ఆరంభం నుంచే శ్రీలంకపై విరుచుకుపడ్డారు. ఐదు వికెట్లు త్వరగా పడిపోవడంతో తొలి టెస్టుపై భారత్ పట్టు మరింత బిగిసింది.



# ట్రెడ్‌మిల్‌పై పరుగుల తుపాను.. యాష్లే ప్రపంచ రికార్డు!

**44 ఏళ్ల వయసులో అసాధారణ ఘనత**

**12 గంటల 47 నిమిషాల్లో 100 మైళ్ల పరుగు**

**గత రికార్డును గంటన్నర తేడాతో అధిగమించిన యాష్లే పాల్సన్**

**140కి పైగా మారథాన్‌లు.. 25కు పైగా ఐరన్‌మ్యాన్ పోటీలు పూర్తి**

**మహిళల విభాగంలో గిన్నిస్ రికార్డుతో సరికొత్త చరిత్ర**

**బోస్టన్, ఆగస్టు 17:** వయసు అడ్డుకాదు.. సంకల్పానికి హద్దులుండవని నిరూపించింది అమెరికా అల్ట్రా మారథాన్ రన్నర్ యాష్లే పాల్సన్. 44 ఏళ్ల వయసులో ట్రెడ్‌మిల్‌పై ఏకంగా 100 మైళ్లు (సుమారు 161 కిలోమీటర్లు) పరుగెత్తి ప్రపంచ రికార్డు సృష్టించింది. కేవలం 12 గంటల 47 నిమిషాల 10 సెకన్లలో ఈ దూరాన్ని పూర్తి చేసి మహిళల విభాగంలో అత్యంత వేగంగా ట్రెడ్‌మిల్‌పై 100 మైళ్లు పరుగెత్తిన అథ్లెట్‌గా గిన్నిస్ రికార్డుల్లో చోటు సంపాదించింది. మసాచుసెట్స్‌లోని బోస్టన్‌లో ఏప్రిల్ 18న జరిగిన మారథాన్ ఎక్స్‌పో వేదికగా యాష్లే ఈ రికార్డు ప్రయత్నం చేసింది. గతంలో నమోదైన రికార్డు కంటే దాదాపు గంటన్నర ముందుగానే లక్ష్యాన్ని చేరుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. వేలాది మంది అభిమానులు చూస్తుండగా గంటల తరబడి ట్రెడ్‌మిల్‌పై పరుగును కొనసాగించి తన అసాధారణ శారీరక, మానసిక సామర్థ్యాన్ని చాటింది.

### 'డ్రెడ్‌మిల్'పైనే కఠోర సాధన

ట్రెడ్‌మిల్‌ను సరదాగా 'డ్రెడ్‌మిల్' అని పిలిచే యాష్లే.. ప్రపంచ రికార్డు కోసం దానిపైనే లెక్కలేనన్ని మైళ్లు సాధన చేసింది. రోడ్డుపై పరుగులో మలుపులు, ఎత్తుపల్లాలు ఉండటంతో శరీర కదలికల్లో మార్పు ఉంటుంది. ట్రెడ్‌మిల్‌పై మాత్రం గంటల తరబడి ఒకే తరహా కదలిక కొనసాగడంతో కొన్ని కండరాలపై నిరంతర ఒత్తిడి పడుతుందని యాష్లే తెలిపింది. రికార్డు ప్రయత్నంలో విరామాలు తీసుకునేందుకు అవకాశం ఉన్నప్పటికీ గడియారం మాత్రం ఆగదు. దీంతో అవసరమైనప్పుడు అతి స్వల్ప విరామాలు మాత్రమే తీసుకుంటూ ఆమె పరుగును కొనసాగించింది. ఒక దశలో ఏకంగా మూడు గంటలపాటు విరామం లేకుండా పరుగెత్తింది.

### 'బాడ్‌వాటర్'లోనూ ఆమెదే రికార్డు

యాష్లేకు ఇది తొలి అసాధారణ ఘనత కాదు. 2023లో ప్రపంచంలోనే అత్యంత కఠినమైన రేసుల్లో ఒకటిగా పేరొందిన బాడ్‌వాటర్ 135 అల్ట్రామారథాన్లోనూ మహిళల విభాగంలో అత్యంత వేగంగా లక్ష్యాన్ని చేరుకున్న రికార్డు ఆమె పేరిట ఉంది. 135 మైళ్ల ఈ రేసులో ఎడారి ప్రాంతంలో తీవ్ర ఉష్ణోగ్రతలను తట్టుకుంటూ పరుగెత్తాల్సి ఉంటుంది. ఇప్పటివరకు యాష్లే 140కి పైగా మారథాన్‌లు, 25కు పైగా ఐరన్‌మ్యాన్ ట్రయాథ్లాన్‌లు పూర్తి చేసింది. అనేక అల్ట్రామారథాన్‌లతో పాటు 200 మైళ్లకు పైగా దూరం ఉండే పోటీల్లోనూ పాల్గొంది.

### కుటుంబమే కొండంత బలం

రికార్డు ప్రయత్నంలో యాష్లేను ప్రోత్సహించేందుకు అభిమానులు ఆమె ప్రత్యేకమైన నియాన్ రంగు జుట్టుకు గుర్తుగా పింక్ విగ్‌లు ధరించి సందడి చేశారు. భర్త మాట్‌తో పాటు నలుగురు పిల్లలు, మనవడు కూడా ఆమెకు అండగా నిలిచారు. తన కుమారుడు ఐప్యాడ్ పట్టుకుని వీడియో కాల్ ద్వారా మిగతా పిల్లలకు తన రికార్డు పరుగును చూపించిన క్షణం ఎప్పటికీ మరిచిపోలేనిదని యాష్లే పేర్కొంది. "పెద్ద కలలు కనండి.. కష్టపడండి.. స్థిరంగా ముందుకు సాగండి" అనే సందేశంతో యాష్లే తన విజయాన్ని కుటుంబానికి అంకితం చేసింది. భవిష్యత్తులో మరిన్ని రికార్డులను బద్దలు కొట్టడమే తన లక్ష్యమని ప్రకటించింది.




# అమ్మాయిల పోరు డ్రా

**అమ్‌స్టెల్‌వీన్ (నెదర్లాండ్స్):** హాకీ ప్రపంచకప్‌లో టైటిల్ వేటను భారత మహిళల జట్టు డ్రాతో ఆరంభించింది. పూల్-డీలో భాగంగా ఆదివారం ఇక్కడ ఉత్కంఠగా జరిగిన మ్యాచ్‌లో భారత్.. చైనాతో పోరును 2-2తో డ్రాగా ముగించింది. మూడో క్వార్టర్ దాకా మ్యాచ్‌లో ఆధిక్యం సాధించి గెలుపు దిశగా సాగిన మన అమ్మాయిలు.. ఆ తర్వాత ప్రత్యర్థికి గోల్ సమర్పించుకుని డ్రాతో సంతృప్తిపడాల్సి వచ్చింది. భారత్ తరఫున నవ్‌నీత్ కౌర్ (8వ నిమిషంలో), దీపికా (26వ) గోల్స్ చేయగా చైనా నుంచి ఝూంగ్ యింగ్ (14వ), మా నింగ్ (39వ) గోల్స్ సాధించారు. తర్వాతి మ్యాచ్‌లో భారత్ ఈనెల 18న దక్షిణాఫ్రికాతో తలపడనుంది. కాగా పురుషుల విభాగంలో భారత్.. తమ రెండో మ్యాచ్‌లో సోమవారం ఇంగ్లండ్‌తో ఆడనుంది.

# 15 ఏళ్లుగా హిట్ లేదు.. క్రేజ్ మాత్రం తగ్గలేదు!

## 2 దశాబ్దాలుగా బాలీవుడ్‌లో చిత్రాంగదా సింగ్

ప్రపంచంలో అవకాశాలు రావడం ఒక ఎత్తయితే.. వాటిని అందిపుచ్చుకుని ఏళ్ల తరబడి ప్రేక్షకుల గుర్తింపులో ఉండటం మరో ఎత్తు. వరుస పరాజయాలు ఎదురైతే స్టార్ హీరోయిన్లకే అవకాశాలు తగ్గిపోయే చిత్రపరిశ్రమలో.. దాదాపు రెండు దశాబ్దాలుగా తనకంటూ ప్రత్యేక గుర్తింపును నిలబెట్టుకున్న నటి చిత్రాంగదా సింగ్. చాలాకాలంగా భారీ వాణిజ్య విజయం లేకున్నా ఆమెపై ప్రేక్షకుల్లో క్రేజ్ మాత్రం తగ్గలేదు. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో జన్మించిన చిత్రాంగదా మోడలింగ్ నుంచి వెండితెరపైకి అడుగుపెట్టారు. 2005లో విడుదలైన లిలి'హజారోన్ ఖ్వైషేన్ ఐసీ'లిలితో కథానాయికగా పరిచయమై తొలి చిత్రంతోనే నటిగా ప్రశంసలు అందుకున్నారు. ఆ తర్వాత పలు హిందీ చిత్రాల్లో నటించి గ్లామర్‌తో పాటు నటనలోనూ తనదైన ముద్ర వేశారు. కథానాయికగానే కాకుండా నిర్మాతగానూ ఆమె తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. 2018లో విడుదలైన క్రీడా నేపథ్య చిత్రం లిలి'సూర్మా'లిలికు నిర్మాతగా వ్యవహరించారు. అయితే కెరీర్‌లో సుదీర్ఘ విరామం తీసుకోవడం తనకు నష్టం చేసిందని చిత్రాంగదా స్వయంగా అంగీకరించారు. దాదాపు తొమ్మిదేళ్ల విరామం కారణంగా అనేక మంచి అవకాశాలు చేజారిపోయాయని తెలిపారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణాన్ని గుర్తుచేసుకున్న చిత్రాంగదా.. కెరీర్‌లో కొన్ని నిర్ణయాలు తప్పుగా తీసుకున్నానని చెప్పారు. 'గ్యాంగ్‌స్టర్', 'తను వెడ్స్ మను' వంటి చిత్రాల్లో నటించే అవకాశాలు తనకు వచ్చినా చేయలేకపోయానని వెల్లడించారు. అలాగే లిలి'మంగళ్ పాండే'లిలిలో అమీషా పటేల్ పోషించిన పాత్రకు కూడా తొలుత తనను సంప్రదించినట్లు తెలిపారు. పెద్ద విజయాలు పలకరించకపోయినా చిత్రాంగదా నటనకు మాత్రం ప్రేక్షకులు, విమర్శకుల నుంచి ప్రశంసలు దక్కుతూనే ఉన్నాయి. సినీ పరిశ్రమలో రెండు దశాబ్దాల ప్రయాణం పూర్తి చేసుకున్నా ఆమె గ్లామర్, ప్రత్యేకమైన స్క్రీన్ ప్రెజెన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటూనే ఉన్నాయి. హిట్ వచ్చిందా.. లేదా అన్నది పక్కనపెడితే, ఇన్నేళ్ల తర్వాత కూడా తనకంటూ క్రేజ్ నిలబెట్టుకోవడమే చిత్రాంగదా ప్రత్యేకతగా మారింది.







# 'డీసీ' ఆద్యంతం అద్భుతంగా ఉంది

## నటుడు మహేశ్ బాబు రివ్యూ

లోకేశ్ కనగరాజ్, వామికా గబ్బి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'డీసీ' ఇటీవల విడుదలైన ప్రశంసలు అందుకుంటోంది. తాజాగా స్టార్ హీరో మహేశ్ బాబు 'డీసీ' చిత్రానికి శుభాకాంక్షలు తెలిపారు. ఎక్స్ వేదికగా తన రివ్యూ ఇచ్చారు. చాలా వినూత్నమైన, అద్భుతమైన చిత్రం. చాలా బాగుంది. ప్రతి అంశం నచ్చింది. ఈ సినిమా కోసం వర్క్ చేసిన వారందరికీ అభినందనలని పోస్ట్ పెట్టారు. ఈ పోస్ట్‌ను దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ రీషేర్ చేస్తూ మహేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 'మీ పోస్ట్ నిజంగా చాలా సంతోషాన్నిచ్చింది. మీరు డీసీని చూడటం, దీన్ని అభినందించడం చాలా ప్రత్యేకంగా అనిపిస్తోంది. మీ ప్రేమకు, కామెంట్స్‌కు ధన్యవాదాలు' అని రిప్లై ఇచ్చారు. దర్శకుడిగా తనదైన ముద్రవేసిన లోకేశ్ కనగరాజ్‌లో నటుడు కూడా ఉన్నారు. పలు చిత్రాల్లో ఆయన తళుక్కున మెరిశారు. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రమే 'డీసీ'. ఇటీవల విడుదలై పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. 'డీసీ' చూశాను. సినిమాను ప్రేమించే ప్రతి ఒక్కరూ ఈ చిత్రాన్ని తప్పకుండా చూడాలి. చిత్రబృందానికి అభినందనలు. దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ చాలా గొప్పగా తీశారు. అనిరుధ్ నిజంగా అద్భుతం చేశారు. లోకేశ్ కనగరాజ్ హీరో పాత్రలో ఒదిగిపోయారని అల్లు అర్జున్ ప్రశంసించారు.

# హిందూమతంపై అనుచిత వ్యాఖ్యలు

## కేసు నమోదు చేసిన బీజేపీ నేతలు

**హైదరాబాద్, ఆగస్ట్ 17:** ప్రముఖ నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్‌కు షాక్ తగిలింది. ఈ మేరకు బోరబండ పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నాయకులు ఆమెపై కేసు నమోదు చేశారు. హిందూమతంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని బీజేపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె వ్యాఖ్యలు కోట్లాదిమంది హిందువుల మనోభావాలను దెబ్బతీశాయంటూ ఫిర్యాదులో తెలిపారు. సోషల్ మీడియాలో మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని అనసూయకు బీజేపీ నేతలు వార్నింగ్ ఇచ్చారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసిన అనసూయపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'జై శ్రీరామ్' ముసుగులో కొందరు దాడులకు దిగుతున్నారంటూ అనసూయ సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ పోలీస్ కేసుపై తగ్గేదేలేదని అనసూయ అంటున్నారు. తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని ఆమె స్పష్టం చేశారు. తన వ్యాఖ్యలతో దొంగలంతా బయటకు వస్తున్నారని.. ఈ విమర్శకులకు అనసూయ కౌంటర్ ఇచ్చారు.



# తల్లి చీరలో త్రిష తళుకులు!

అమ్మ చీర అంటే కేవలం వస్త్రం కాదు.. అందులో ఎన్నో జ్ఞాపకాలు, అనుబంధాలు దాగుంటాయి. అలాంటి అమ్మ చీరను కట్టుకుని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో తళుక్కుమన్నారు ప్రముఖ నటి త్రిష. బంగారు వర్ణం చీరలో సంప్రదాయబద్ధంగా కనిపించిన ఆమె ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చెన్నై మెరీనా బీచ్‌లో తమిళనాడు ప్రభుత్వం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సినీ, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న త్రిషకు మంత్రుల గ్యాలరీలో ప్రత్యేక సీటు కేటాయించారు. ముఖ్యమంత్రి విజయ్ తల్లిదండ్రుల పక్కనే కూర్చున్న ఆమె వేడుకలను వీక్షించారు. కార్యక్రమానికి వచ్చిన పలువురిని ఆప్యాయంగా పలకరించారు. అయితే వేడుకల్లో త్రిష ధరించిన చీర అందరి దృష్టినీ ఆకర్షించింది. దాని వెనుక ఉన్న ప్రత్యేకతను త్రిష స్వయంగా వెల్లడించారు. తాను ధరించింది తన తల్లి చీరేనని చెబుతూ, ఆ చీరలో దిగిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో అభిమానులతో పంచుకున్నారు. తల్లి చీరను ధరించడం తనకు ఎంతో ప్రత్యేకమైన అనుభూతిని ఇచ్చిందని పేర్కొన్నారు. బంగారు వర్ణం చీరలో సంప్రదాయ లుక్‌తో మెరిసిన త్రిష ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. 'అమ్మ చీరలో అమ్మాయి అందం మరింత ప్రత్యేకం' అంటూ అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. తల్లి జ్ఞాపకాన్ని తన వస్త్రధారణలోనూ ప్రతిబింబించిన తీరు ఆకట్టుకుంటోందని వ్యాఖ్యానిస్తున్నారు. సినిమాల విషయానికొస్తే త్రిష ఇటీవల సూర్య కథానాయకుడిగా నటించిన 'కరుప్పు' చిత్రంలో కనిపించారు. ఆర్జే బాలాజీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం తెలుగులో 'వీరభద్రుడు' పేరుతో విడుదలైంది. ప్రస్తుతం చిరంజీవి కథానాయకుడిగా వశిష్ట దర్శకత్వంలో రూపొందుతున్న లిలి'విశ్వంభర'లిలిలో త్రిష కథానాయికగా నటిస్తున్నారు. మోహన్‌లాల్ కథానాయకుడిగా జీతూ జోసెఫ్ తెరకెక్కిస్తున్న మలయాళ చిత్రం లిలి'రామ్'లిలిలోనూ ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారు.



This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com